ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 8 మే 2024





పోస్టల్ ఓటు వేసేందుకు గుంటూరు ఉమెన్స్ కాలేజీలో బారులు తీరిన ఉద్యోగులు

పోస్టల్ పోలింగ్.. ప్రహసనం



గుంటూరు ఏసీ కళాశాలలో క్యూ

- పోటెత్తిన ఉద్యోగులు.. ఓటింగ్‌లో గందరగోళం
- ఓటింగ్‌లో ఉద్దేశ పూర్వకంగా జాప్యం
- అస్తవ్యస్తంగా మారిన అధికారుల నిర్ణయాలు
- ఆర్వోల తీరుపై ఆగ్రహం, సిబ్బందితో వాగ్వాదం
- ఎక్కువ ఓటర్లకు తక్కువ బూత్‌లతో ఇబ్బందులు
- పోలింగ్ శాతాన్ని తగ్గించే కుట్ర అంటూ మండిపాటు
- జాబితాలో పేర్లు గల్లంతు.. దరఖాస్తు చేసినా మొండిచెయ్యే
- తాడికొండలో ఉద్యోగులను గెంటివేయించిన ఆర్వో

తెనాలి, గుంటూరు, పొన్నూరు టౌన్, నరసరావుపేట, చీరాల, బాపట్ల, మే 7: ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గిపోతుంది.. అందరూ ఓటు వేయాలని పెద్దఎత్తున ప్రచారాలు, చైతన్య సదస్సులు అధికారులు నిర్వహిస్తున్నారు. అయితే తమ తోటి ఉద్యోగులు ఓటు వేసేందుకు వచ్చినా వారికి ఆ అవకాశం లేకుండా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ప్రహసనంగా మార్చారన్న విమర్శలు వస్తున్నాయి. తొలి రోజు తక్కువ మంది ఓటర్లు ఉండటంతో ఎటువంటి అవాంతరాలు ఎదురుకాలేదు. మంగళవారం చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే కావాలనే ఉద్యోగ ఓటర్లకు ఇబ్బందులు సృష్టించారా అన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. పోలింగ్ ప్రక్రియ ప్రారంభంలోనే జాప్యం చేశారు. ఇక ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటులోనూ నిర్లక్ష్యం చూపారు. కనీస సౌకర్యాలు కూడా చాలాదగ్గర్ల కల్పించలేదు. బ్యాలెట్ ఓట్ల అమ్మకాలు జరగకుండా ఎన్నికల సంఘం తీసుకున్న కొత్త నిర్ణయాలు ఉద్యోగులకు అగ్ని పరీక్షగా మారాయి. గతంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఉద్యోగులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. అభ్యర్థులే పోస్టల్ బ్యాలెట్ సేకరించి వినియోగించుకునేందుకు ప్రయత్నాలు చేసేవారు. అయితే గడిచిన ఐదేళ్లలో చోటుచేసుకున్న పరిణామాలతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఈ దఫా ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉద్యోగులు ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులపై అధికార పార్టీ నేతలు, అభ్యర్థులు ఒత్తిడితేవడంతో వారు రెండు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో దురుద్దేశపూరక వైఖరి అవలంభించారని ఉద్యోగులు వాపోయారు. తమ ఓటుకు సంబంధించి ఉద్యోగులు రెండు రోజుల నుంచి ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. మంగళవారం పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బుధవారమైనా అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. అంతే కాక మరో రోజు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం పోలీసులకు అవకాశం కల్పించారు. అయితే ఎక్కువ మంది ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన బందోబస్తు ఉండడంతో గురువారం కూడా వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తీరు వల్ల అనేకమంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. తమ వద్ద ఓటు లేదంటూ వెనుక్కు తిప్పి పంపారు. ఈనేపథ్యంలో గురువారం కూడా అవకాశం కల్పించి ప్రతి ఒక్క ఉద్యోగి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది.

కుట్రలపై అనుమానాలు

ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం అధికార పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో వారు తమ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భావనలో వైసీపీ నేతలున్నారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత ఎక్కువ మందిని ఓటుకు దూరం చేసే కుట్రలో భాగంగానే పోస్టల్ బ్యాలెట్‌లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారా అన్న అనుమానాలు ఉద్యోగుల నుంచే వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి ఓటింగ్‌లో అవాంతరాలపై ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. దరఖాస్తు చేసుకున్నా జాబితాలో ఓటు లేకపోవడం, ఫెసిలిటేషన్ కేంద్రాలు తగినన్ని ఏర్పాటు చేయకపోవడం, ఓటు విషయంలో గందరగోళం తదితరాలపై కనీస చర్యలు లేవు. మరోవైపు ఆయా కేంద్రాల వద్ద వైసీపీ ప్రలోభాల పర్వం నడుస్తూనే ఉంది. గతానికి భిన్నంగా ఈ సారి ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం అత్యధికంగా ఫాం 12 దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఓటింగ్ శాతాన్ని తగ్గించడానికి ఎన్నికల అధికారుల ద్వారా వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని సమాచారం. దీంతో ఫెసిలిటేషన్ కేంద్రాలకు వచ్చి వారు ఓటు వేయకుండా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా ఇబ్బందులకు గురి చేసి ఓటింగ్‌కు దూరమయ్యేలా చేయాలనే కుట్రలో భాగమే ఇదంతా అని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అరకొర ఏర్పాట్లతో పాటు ఎన్నికల అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమ ఓటు ఎక్కడ ఉందో చెప్పకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారని ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఉద్యోగి రెండు రోజులుగా రెండుమూడు పోలింగ్ సెంట ర్లకు వెళ్లి తమ ఓట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి కల్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఫోన్ లైట్ కాంతిలో ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులు



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

దరఖాస్తు చేసుకున్నా ఓట్లు గల్లంతు

విధుల నిమిత్తం బాపట్ల జిల్లాలో ఉంటూ మరో జిల్లా పరిధిలో ఓటు ఉన్న వారికి ఇక్కడి జిల్లా కేంద్రాల్లో ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. అయితే తమపేరు లేదని ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా మొత్తానికి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 3,527 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉంది. అయితే ఓటు హక్కు వినియోగం కోసం వచ్చిన పలువురు ఉద్యోగులకు జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిలో ఓటు హక్కు ఉన్న ఓ ఉద్యోగి విధి నిర్వహణ బాపట్ల జిల్లా వేమూరులో చేస్తుండడంతో ఓటు వినియోగానికి మంగళవారం బాపట్లకు రాగా జాబితాలో పేరు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఫాం 12 దరఖాస్తు చేసినా జాబితాలో పేరు లేకపోవడం ఏమిటని వాపోయారు. ఇదే రీతిన పలువురి ఓటు గల్లంతుకాగా వారి కోసం ఓ రిజిష్టర్ ఏర్పాటు చేశారు. ఈ జాబితాలో వంద వరకు నమోదు చేసుకున్నారు. ఫాం12 దరఖాస్తు చేసినా పేరు ఎందుకు లేదనే ప్రశ్నకు ఆర్వోల నుంచి సమాధానం కరువైంది. పోలీసు బలగాలు సరిపడా లేని జిల్లాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు వినియోగించుకుంటున్నారు. బాపట్ల జిల్లాలో 650 మంది క్యాడెట్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి అనుమతి తెలిపారు. వీరికి కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలి. అయితే కేవలం 150 మందికి మాత్రమే పోస్టల్ ఓటు వచ్చింది. వేరే జిల్లాలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు ఓటుకు దూరమయ్యారు.

ఫెసిలిటేషన్ సెంటర్లపై నిర్లక్ష్యం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా 2019 నాటి సంఘటనలు పునరావృతం అయ్యాయి. ఫెసిలిటేషన్ సెంటర్లలో అరకొర వసతులు, ఓటర్లకు తగినట్లుగా కౌంటర్లు లేకపోవడం వంటివి తిరిగి చోటు చేసుకున్నాయి. దీంతో ఉదయం 8 గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన ఓటరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసి బయటకు రావడానికి మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం పడుతుందని ఉద్యోగులు వాపోయారు. వేల సంఖ్యలో ఓటర్లున్న నియోజకవర్గాల్లోనూ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. తొలి రెండు రోజులు కేవలం పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్లకు పోస్టల్ బ్యాలెట్ కావడం వలన పెద్దగా సమస్యలు రాలేదు. ఇందుకు కారణం వారి సంఖ్య చాలా తక్కువ. మంగళ ఒక్కో ఫెసిలిటేషన్ సెంటర్‌కి వేల సంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. వారిని అదుపు చేయలేక అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. ప్రత్యామ్నాయంగా ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నాలుగైదు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. గత నెల 10వ తేదీనే 'పోస్టల్ బ్యాలెట్లు... పాట్లు' అనే శీర్షికతో 2019లో ఫెసిలిటేషన్ సెంటర్లలో జరిగిన గందరగోళంపై కథనాన్ని ప్రచురించింది. అయినప్పటికీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యం చెందారు. ఈ కారణంగానే మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ఫెసిలిటేషన్ సెంటర్లలో తీవ్ర గందరగోళం తలెత్తింది.

తెనాలిలో బేరసారాలు

తెనాలిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం అధికార పార్టీ నాయకులు మంగళవారం రోజంతా బేరసారాలు చేపట్టారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో పది మందికి పైగా ఏజంట్ల పేరుతో వైసీపీ నాయకులు ఉండి బేరాలు చేస్తూనే ఉన్నారు. అయితే పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. గత ఎన్నికల్లో రూ.2 వేలకు కక్కుర్తి పడితే లక్షల్లో నష్టాం తెచ్చారని, ఈ సారి మోసపోలేమని వారిముఖంపైనే తేల్చి చెప్పారు.

నరకం చూపారు..

ఓటు హక్కు వినియోగించుకునేందుకు కసిగా కదం తొక్కిన ఉద్యోగులకు ఎన్నికల అధికారులు నరకం చూపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో అత్యధిక మంది గుంటూరు పశ్చిమలో నివాసం ఉంటున్నారు. వారిలో ఎక్కువ మందికి ఓటు ఎక్కడ ఉందనే విషయంపై సోమ, మంగళవారాల్లో అధికారులు గందరగోళం సృష్టించారు. అక్కడికి ఇక్కడికి అంటూ తిప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇక పలు నియోజకవర్గాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కసిగా ఉన్న ఉద్యోగులు ఉదయమే వచ్చి పడిగాపులు కాశారు. తీరిగ్గా వచ్చిన అధికారులు ఆ తర్వాత కూడా తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. ఉద్యోగ ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కౌంటర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో క్యూల్లో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7 గంటలకు కేంద్రం వద్దకు వచ్చిన ఉద్యోగులు సాయంత్రం 4 వరకు కూడా ఓటును వినియోగించుకోలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనారోగ్య సమస్యలున్న వారు గంటలకొద్ది వేచి ఉండలేక, ఓటు వేయకుండా వెనుతిరగలేక సతమతమయ్యారు. వారే ఎదురు చూసి వెనక్కి వెళ్ళిపోతారులే అనే ఉద్దేశంగా పలు కేంద్రాల వద్ద పోలింగ్ వ్యవహారం సాగినట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. అయినా మెజారిటీ సంఖ్యలో ఉద్యోగులు నిరీక్షించి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుంటూరు పశ్చిమలో రాత్రి 9 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది.

ఓటేసే వరకు వెళ్లం..

ఓటు హక్కు కల్పించండి.. ఓటు వేసే వరకు వెళ్లేది లేదు.. అని తాడికొండకి సంబంధించి లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రంలో ఉద్యోగ ఓటర్లు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ పక్రియ 11 గంటలకు ప్రారంభమైంది. తొలుత ఓట్లు ఉన్నాయని చెప్పి తీరా సాయంత్రం 5 గంటలకు ఓటు లేదు.. మీమీ నియో జకవర్గాలు, పనిచేసే చోటే ఓట్లు వేసుకోవాలని ఆర్వో గంగరాజు చెప్పటంతో ఉద్యోగులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి వర్షం పడు తున్న ఉద్యోగులు వర్షంలోనే నిల బడి ఓటు కోసం అభ్యర్థించారు. ఓ సందర్భంలో ఉద్యోగులను పోలీ సులు చేత బయటకు గెంటివేయించారు. దీంతో ఉద్యోగులు ఆందోళన చేశారు. తాడికొండ పరిధిలోని వారికి కూడా ఓటు లేదని చెప్పడంతో తాము ఎక్కడికి వెళ్లి వినియోగించుకోవాలో చెప్పాలని ఆర్వోపై మండిపడ్డారు. మీడియా ప్రతినిధులను పోలింగ్ కేంద్రం వద్దకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఓటు వేసే వెళ్తామని ఉద్యోగులు భీష్మించారు. గుంటూరు జిల్లాలో పని చేసే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్న కలెక్టర్ ఆ దేశాలతో ఉద్యోగులు శాంతించారు.

గుంటూరు పశ్చిమలో పరీక్ష

గుంటూరు లోక్‌సభ పరిధిలో 20,755 మంది పోస్టల్ ఓటర్లు ఉండగా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు. పలు కేంద్రాల్లో సాధారణ పోలింగ్ మాదిరిగా వేల మంది ఓటు వేసేందుకు రాగా గంటల తరబడి ఎండలోనే క్యూలైన్లలో ఉండాల్సి వచ్చింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి మహిళా కాలేజీ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మధ్యాహ్నం 11 గంటల వరకూ ప్రారంభం కాలేదు. 6 వేల మంది ఓటర్లున్న నియోజకవర్గంలో మూడు కౌంటర్లే ఏర్పాటు చేయడంపై ఆర్వో రాజ్యలక్ష్మిపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి గమనించిన టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించడంతో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇక టెంట్లు వేయకపోవడంతో భారీ సంఖ్యలో తరలివచ్చిన ఓటర్లు ఎండలోనే నించోవాల్సి వచ్చింది. ఇలాగే జాప్యం జరిగితే సగం మంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేరని చెబుతున్నారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించాలనే కుట్రతోనే అధికార పార్టీ మంత్రి విడదల రజనీ కుట్రలు పన్నుతోందని పలువురు ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలోకి ఆయా అభ్యర్థులతో పాటు ఏజెంట్లకు మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ అభ్యర్థి విడదల రజిని వెంట ఏజెంట్లతో పాటు పార్టీ నాయకులు కూడా గుంపుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. పోలీసులు ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు.

సదా.. మీ సేవలో

- ప్రజా సేవకోసమే మాతృభూమికి వచ్చాను..
- నా డబ్బును కాదు.. నా క్యారెక్టర్ చూసి భయపడుతున్నారు..
- ఐదేళ్లుగా ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు
- జగన్ అంటేనే భయపడిపోతున్నారు
- ఇంత ప్రజా వ్యతిరేకత మూటగట్టుకొన్న ప్రభుత్వాన్ని చూడలేదు
- భారీ మెజార్టీలతో టీడీపీ అభ్యర్థుల గెలుపు ఖాయం
- ఉద్యోగులు 90 శాతం మాకే ఓట్లు వేస్తున్నారు



8లో..

● ఆంధ్రజ్యోతితో టీడీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

చెలరేగిపోతోన్న వైసీపీ మూకలు





బాధితులను పరామర్శిస్తున్న యరపతినేని

నరసరావుపేట టౌన్, గురజాల టౌన్, ఈపూరు, పిడుగురాళ్ల, మే 7: పోలింగ్ సమయం సమీపిస్తోన్నది. ప్రచారానికి నాలుగు రోజులే గడువు. ఆరో రోజున పోలింగ్ జరగనున్నది. ఎక్కడికక్కడ ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ అభ్యర్థులు జోష్ మీద ఉండగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో వైసీపీ మూకలు చేలరేగిపోతున్నాయి. టీడీపీ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వారే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు దాడులు చేస్తున్నాయి. సోమవారం నరసరావుపేటలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద జరిగిన దాడి ఘటన మరువక ముందే మంగళవారం స్థానిక బాబాపేటలో వైసీపీ రౌడీలు పేట్రేగిపోయారు. టీడీపీ ఆరో వార్డు అధ్యక్షుడు మానేడి మోహనరావు ఇంటిపై పెట్రో బాంబులు, రాళ్లు, కర్రలు, రాడ్లతో వైసీపీ నేతలు దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దాడిలో మోహనరావు, ఆయన బంధువులు అరుణ, కుంకు వెంకటకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దాడులకు ఉసికొల్పుతున్నారని అరవిందబాబు ఆరోపించారు.

దైదలో వైసీపీ మూకల బీభత్సం

టీడీపీ నేతల ప్రచారంలో పాల్గొని ఇళ్లకు వెళ్తున్న వారిపై కాపుకాచి వైసీపీ మూకలు దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని దైదలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు కాలెంకాయల వెంకయ్య, శ్రీనులు కూటమి తరపున జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటికి వస్తుండగా వారింటి సమీపంలో కాపు కాసి ఉన్న వైసీపీ రౌడీ మూకలు జై జగన్ అంటూ కవ్వింపునకు దిగారు. వెంకయ్య వారి వద్దకు వెళ్లి మా ఇంటి ఎదురుగా మద్యం తాగడం ఏమిటి.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. దీంతో ఆగ్రహించిన వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో వెంకయ్యపై దాడి చేసి రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. వెంకయ్య కుమారుడు శ్రీను అడ్డుకోబోగా అతడిపైన వరుసకు సోదరయ్యే పగడాల వెంకట్రావమ్మపై కూడా దాడి చేశారు. గ్రామస్తుల రాకతో వైసీపీ మూకలు పరారయ్యాయి. గాయపడిన వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అర్ధరాత్రి 12 గంటల సమయంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. శ్రీనుకు బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో నరసరావుపేటకు పంపారు.

దాడి సమయంలో కానరాని పోలీసులు

దైద ఫ్యాక్షన్ గ్రామం. గ్రామంలో నలుగురు పోలీసులతో పికెట్ ఉంది. గ్రామంలో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. అయితే దాడి సమయంలో పోలీసులు కనిపించలేదు. దాడి రాత్రి 11 గంటలకు జరిగినా అర్ధరాత్రి 12:30 గంటల వరకు కూడా పోలీసులు వైద్యశాలకు చేరుకోలేదు. అనంతరం బాధితుల వద్ద నుంచి ఫిర్యాదు స్వీకరించారు. వైసీపీకి చెందిన తెల్లమేకల చక్రవర్తి, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, గుండెబోయిన సతీష్‌లను అరెస్టు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

కరాలపాడులో టీడీపీ నేత ఇంటిపై రాళ్లతో దాడి

పిడుగురాళ్ల మండలం కరాలపాడులో సోమవారం రాత్రి టీడీపీ నాయకుడు అనబోతుల ఆంజనేయరెడ్డి ఇంటిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ మూకలు రాళ్లతో దాడి చేశాయి. ఆంజనేయరెడ్డి ఇంట్లో ముడేల సుబ్బారెడ్డి, మరికొందరు నేతలతో మాట్లాడుతుండగా తలుపునకు బయట గడియ పెట్టి రాళ్లు విసిరారు. దాడి సమాచారాన్ని ఆంజనేయరెడ్డి ఫోన్లలో బంధువులకు సమాచారం ఇవ్వగా వారు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. పోలీసుల రాకతో అక్కడున్న వారు వెనుతిరిగారు. ఆంజనేయరెడ్డి, సుబ్బారెడ్డిలు ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ అక్కసుతోనే వారిపై రాళ్ల దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది.



బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వేల్పుల సింహాద్రియాదవ్ తదితరులు



కారు దహనం..

ఈపూరు మండలంలోని ముప్పాళ్లలో టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ మోదుగుల నరసింహారావు కారుకు మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు ఇంట్లో నిద్రిస్తున్న నరసింహారావుకు మంటలు విషయం తెలియజేశారు. గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ఆయన ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే తనపై కక్షతో కారుకు నిప్పు పెట్టారని నరసింహారావు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈపూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

గుంటూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. గుంటూరు ఈస్ట్				
2. గుంటూరు వెస్ట్				
3. తాడికొండ				
4. ప్రత్తిపాడు				
5. మంగళగిరి				
6. తెనాలి				
7. పొన్నూరు				
8. బాపట్ల				
9. రేపల్లె				
10. వేమూరు				
11. మాచర్ల				
12. గురజాల				
13. వినుకొండ				
14. చిలకలూరిపేట				
15. నరసరావుపేట				
16. పెదకూరపాడు				
17. సత్తెనపల్లి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : శివశంకరీ దేవాలయం దగ్గర, వెంగళాయపాలెం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా



రోడ్‌షోలో ప్రజలకు అభివాదంచేస్తున్న పెమ్మసాని, నరేంద్రకుమార్

ముస్లింల హక్కులకు భంగం కలగనీయం

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్
- నరేంద్రకుమార్‌తో కలసి పొన్నూరులో రోడ్ షో
- వర్షంలోనూ అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

పొన్నూరుటౌన్, మే7: ముస్లింలు, క్రైస్తవుల హక్కులకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోబోమని కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్ర స్పష్టం చేశారు. మంగళవారం పొన్నూరు పట్టణంలో కూటమి అభ్యర్థుల రోడ్ షో జరిగింది. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. ఐలాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ పొన్నూరు గడ్డలో పుట్టిన ఆచార్య ఎన్జీరంగా రైతుల కోసం అహర్నిశలు పాటుపడ్డారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడి ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొస్తుందని ఆరోపించారు. ఈ చట్టం ద్వారా ప్రజల భూములు, పొలాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పొన్నూరులో అక్రమ పాలన సాగిందని ఆరోపించారు. 700 ఎకరాలో అక్రమ మైనింగ్ సాగించి వందల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. ముస్లిం మైనార్టీలకు మాట ఇస్తున్నామని వారి హక్కులకు భంగం కలిగితే తాను కానీ, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కానీ రాజీనామాలు చేయటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేసారు. అబ్దుల్ కలామ్‌ను రాష్ట్రపతిని చేసింది తెలుగుదేశం పార్టీ అన్నారు.

అరాచక పాలనకు ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధం : ధూళిపాళ్ళ

వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఈ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మంత్రి అంబటి రాంబాబు క్యారెక్టర్ గురించి ఆయన అల్లుడే స్వయంగా చెప్పారన్నారు. అలాగే అయిన సోదరుడు అంబటి మురళి సత్తెనపల్లిలో చేసిన అకృత్యాల గురించి పలుమార్లు తాము నిరూపించినట్లు చెప్పారు. క్రికెటర్ అంబటి రాయుడు కుటుంబం గురించి మురళీ మాట్లాడటం విస్మయాని కల్గిస్తుందన్నారు. రాయుడు పెద్ద నాన్న అంబటి లక్ష్మణరావు న్యాయమూర్తిగా వ్యవహరించటంతోపాటు, వెల్లలూరు అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అంబటి మురళి 6 నెలల ముందు మామిళ్లపల్లి వచ్చి తానేదో ఉద్దరించటానికి వచ్చినట్లు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. ఈ రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసన్న పాల్గొని అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయబాబు, షేక్ కరిముల్లా, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధాకర్, బీసీ నాయకులు నిమ్మల శేషయ్య, తదితర్లతోపాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విజయవాడకు ప్రధాని రాక

- విజయవాడ మార్గంలో వాహన రాకపోకలు దారి మళ్ళింపు

గుంటూరు, మే 7 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోడి విజయవాడ వస్తున్నందున ఆ మార్గంలో వాహన రాకపోకలు దారి మళ్ళించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. గుంటూరు వైపు నుండి విజయవాడ వైపు వెళ్ళు అన్ని వాహనాలను బుధవారం మధ్యాహ్నం 1.00 గంట నుండి రాత్రి 8.00 గంటల వరకు దారి మళ్లించామన్నారు. గుంటూరు నుండి విజయవాడ వైపుకు వెళ్ళు వాహనాలను బుడంపాడు అండర్ పాస్ కింద నుండి నారాకోడూరు- చేబ్రోలు పొన్నూరు - చందోలు, చెరుకుపల్లి -భట్టిప్రోలు -రేపల్లె అవనిగడ్డ -మచిలీపట్నం మీదుగా హనుమాన్ జంక్షన్ దగ్గర నేషనల్ హైవే 16 లో కలవాలని కోరారు. అలాగే గుంటూరు నుండి హైదరాబాదుకు వెళ్లే వాహనాలు చుట్టుగుంట, పేరేచర్ల -సత్తెనపల్లి- పిడుగురాళ్ల మీదుగా హైదరాబాదు వెళ్ళాలన్నారు.

మంగళగిరి సమగ్రాభివృద్ధి..

లోకేశ్‌తోనే సాధ్యం

- సూపర్ సిక్స్‌తో ప్రజలందరికీ ప్రయోజనం
- వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి
- మంగళగిరిలో లోకేశ్ కుటుంబ సభ్యుల ప్రచారం



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన లోకేశ్ కుటుంబ సభ్యులు



మంగళగిరి సిటీ, మే7: మంగళగిరిలో భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే ప్రజలంతా నారా లోకేశ్‌కు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని లోకేశ్ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి పట్టణంలోని 10, 11 వార్డుల్లో మంగళవారం లోకేశ్ కుటుంబ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. తొలుత శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డుల్లో ఇంటింటికీ తిరిగి కూటమి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ కరపత్రాలను పంచుతూ ప్రచారంలో పాల్గొన్నారు. స్థానికులు పలు సమస్యలను విన్నవించగా, ఆయా సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. లోకేశ్ కుటుంబ సభ్యులకు మంగళగిరి పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ మనుమడు గారపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ నారా లోకేశ్ గత అయిదేళ్లుగా శ్రమిస్తూ మంగళగిరి ప్రజలకు దగ్గరయ్యారని తెలిపారు. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడమే లోకేశ్ లక్ష్యమన్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పేరిట చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు ఉపాధి, భృతి, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సౌకర్యాలు లభిస్తాయన్నారు. సామాజిక భద్రతా పింఛన్లు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, పక్షవాతం వంద శాతం వున్న వారికి రూ.పది వేల చొప్పున పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి, సంక్షేమం జాడ లేవన్నారు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదన్నారు. పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులను గాలికొదిలేశారని, మూడు రాజధానుల పేరిట అమరావతిని సర్వనాశనం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్ర బాబు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గ మన్నారు. ప్రజలకు మేలు చేయడం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో గారపాటి లోకేశ్వరి, నందమూరిమాధవి మణి, గారపాటి శ్రీనివాస్, కంఠమనేని శ్రీనివాస్ ప్రసాద్, శారదా దుర్గాప్రసాద్, కవిత ప్రసాద్, మంగళగిరి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలుపాల్గొన్నారు.



మంగళగిరి పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న లోకేశ్ కుటుంబ సభ్యులు

పోస్టల్ బ్యాలెట్.. రీ పోలింగ్

- పోస్టల్ బ్యాలెట్‌ల జారీలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం
- చిలకలూరిపేట ఆర్వోకు షోకాజ్ నోటీసు.. ఏఆర్వో సస్పెన్షన్
- నేడు, రేపు రీపోలింగ్..



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

చిలకలూరిపేట,మే7: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఈనెల 5వ తేదీన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సందర్భంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను రిటర్నింగ్ అధికారి బీ.నారదమునికి షోకాజు నోటీస్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నాదెండ్ల తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు పల్నాడుజిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మంగళవారం తెలిసానే. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈనెల 8, 9 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌ల రీ పోలింగ్ జరుగుతుందని ప్రకటించారు. ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో పోస్టల్ బ్యాలెట్‌కు బదులు ఈవీఎం పేపర్ బ్యాలెట్ ను జారీ చేశారని పేర్కొన్నారు. ఈ పోలింగ్‌లో పాల్గొన్న 1,219 మంది ఉద్యోగులు తిరిగి ఈ రెండు రోజుల్లో పోలింగ్‌కు హాజరై పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించు కోవాలని ఆయన కోరారు. నాదెండ్ల మండలం గణపవరంలోని కేబీ జిల్లాపరిషత్ హైస్కూల్ లోనే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సక్రమంగానే జరిగిందని, ఎంపీ ఎన్నికకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విషయంలోనే ఈతప్పు జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈవిషయంపై సమాచారం అందిన వెంటనే పూర్తి పరిశీలన జరిపి ఎన్నికల సంఘానికి నివేదించామని ఆయన పేర్కొన్నారు ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు తిరిగి పోలింగ్‌జరపాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేటలో జరిగిన సంఘటన నేపథ్యంలో జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేకంగా నియమించి ఈవీఎంలు స్ట్రాంగ్ రూముకు చేరేవరకు ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని ఎప్పటికప్పుడు పరిశీలన చేయిస్తామని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెల్లలూరు వాసులు

అంబటి రాయుడు కుటుంబాన్ని విమర్శిస్తే సహించబోం

పొన్నూరుటౌన్, మే7: క్రికెట్‌లో రాణించటం ద్వారా వెల్లలూరికే ఖ్యాతి తెచ్చిన అంబటి రాయుడు కుటుంబాని విమర్శిస్తే సహించబోయేది లేదని వెల్లలూరు జనసేన అధ్యక్షుడు సుదావసంత్ హెచ్చరించారు. మంగళవారం వెల్లలూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబటి రాయుడు గ్రామ శివాలయ నిర్మాణానికి రూ.కోటి ఇచ్చారని రైతులు ఇబ్బంధులు తొలగించటానికి మూడు కిలో మీటర్ల మేర మురుగు కాల్వలు తవ్వించారని, గ్రామ శ్మశాన వాటికకు రూ.10 లక్షలు, పాఠశాలల మరమ్మతులకు నిధులు, అనాధ చిన్నారుల విద్యకు నిధులు అందజేస్తున్నారని తెలిపారు. అంబటి మురళీకృష్ణ ఓటమే ధ్యేయంగా వెల్లలూరు వాసులు పనిచేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ, మండల ఉపాధ్యాక్షుడు గనిపిశెట్టి రామకృష్ణ, అంబటి శ్రీనివాసరావు, ఇమ్మడి శ్రీనివాసరావు, సూద అంకమ్మరావు, గూడపాటి కాలేశ్వరరావు, చందు డిల్లీ, ఇక్కుర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మాదిగల ద్రోహి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

కారంపూడి, మే 7: మాదిగ సామాజిక వర్గానికి సీఎం జగన్‌రెడ్డి ద్రోహం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగల ఓట్లు వేయించుకొని వారినే అణగదొక్కిన వ్యక్తి జగన్ అన్నారు. తోట త్రిమూర్తులు అనే వ్యక్తి మాదిగలకు శిరోముండనం చేయిస్తే ఆయనను పార్టీ నుంచి బహిష్కరించాల్సింది పోయే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి పక్కన పెట్టుకున్నారన్నారు. ఓ ఎమ్మెల్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కారుడ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేస్తే ఆఎమ్మెల్సీకి శిక్ష విధించకుండా పార్టీలో అత్యున్నత స్థానమిచ్చి వెంటతిప్పుకుంటున్నారన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మాదిగలంటే విశ్వాసం లేదన్నారు. మాదిగల పట్ల విశ్వాసం కలిగిన బ్రహ్మారెడ్డిని, కులమతాలకు అతీతంగా సాయం మందించే లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, పంగులూరి అంజయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కటికల పేరయ్య మాదిగ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, కార్యదర్శి తోట నరసింహారావు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి బలవన్మరణం

- కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య



కిషోర్ బాబు (ఫైల్)

పొన్నూరుటౌన్, మే7: పొన్నూరు పట్టణంలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న తుల్లుమిల్లి కిషోర్ బాబు(32) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం నిడుబ్రోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు చేరుకున్న కిషోర్ బాబు వాటర్ వర్క్స్ సిబ్బందితో మాట్లాడుతూ చెరువులో వాటర్ లెవల్స్ పరిశీలించి నమోదు చేయటానికి వెళ్లతున్నటుగా చెప్పి చెరువు వద్దకు వెళ్లాడు. అయితే ఎంతసేపటికి తిరిగి రాకపోవటంతో స్థానిక సిబ్బంది చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ చెప్పులు, ఇతర వస్తువులు ఉండటంతో అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ సీఐ భాస్కర్ గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో వెతికారు. మధ్యాహ్నం సమయంలో కిషోర్ బాబు మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికితీశారు. అతనికి ఏడాది క్రితం చంద్రకళ అనే యువతితో వివాహమైంది. ఆమె కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. భార్య, భర్తలు మూడు నెలల క్రితమే బదిలీపై పొన్నూరు వచ్చారు. వారిద్దరు తరచూ ఘర్షణలు పడుతునట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం కూడా ఘర్షణ పడిన భార్యాభర్తలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసుకోవటంతో ఇరువురిని పిలిచి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మంగళవారం ఉదయం మరోసారి పోలీస్‌స్టేషన్‌కు రమ్మని పిలవటంతో మనస్థాపానికి గురైన కిషోర్ బాబు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు అనుమానిస్తున్నారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కిషోర్ బాబు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమన్లు అందుకున్న పోలీసులను


ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

చుండూరు, మే 7: జిల్లా తెలుగు యువత నాయకుడు గూదేటి బాలకోటిరెడ్డిని గతంలో అక్రమంగా నిర్బంధించి హింసించిన కేసులో కోర్టు సమన్లు అందుకున్న పోలీసులను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చుండూరుకు చెందిన జిల్లా తెలుగు యువత నాయకుడు బాలకోటిరెడ్డిని గతంలో చుండూరు ఎస్ఐ అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో కేసు నమోదు చేసి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఉంచి చిత్ర హింసలకు గురి చేశారని ఆరోపించారు. దీనిపై బాధితుడు కోర్టును ఆశ్రయించగా తెనాలి 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు పోలీసులకు సమన్లు జారీ చేసిందన్నారు. గతంలో జిల్లాలో వివిధ స్టేషన్ల పరిధిలో పనిచేసిన సీఐ రాజమోహన్, ఎస్సైలు నవీన్‌కుమార్, పి.సురేష్, జి.రాజ్యలక్ష్మి, ఎ.చంద్రశేఖర్, డి.రామకృష్ణను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల కమీషన్‌ను కోరారు.

అమరావతి రైతులను రోడ్డు పాలు చేశారు

- 1603వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే7: మూడు ముక్కలాటతో రాజధాని అమరావతి రైతులను రోడ్డు పాలు చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ప్రజల ఆస్తులను సీఎం జగన్‌రెడ్డి చేతుల్లో పెట్టుకోవాలని చూస్తున్నాడని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు , రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1603వ రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీని ఈ ఎన్నికలలో తరిమి కొట్టాలన్నారు. అభివృద్ధికి తిలోదకాలిచ్చి వినాశనానికి ద్వారాలు తెరిచిన వైసీపీని శాశ్వతంగా ఇంటిలో కూర్చోబెట్టాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00



సభాస్థలి పరిశీలనలో జూలకంటి బ్రహ్మారెడ్డి, మధుబాబు

11న చంద్రబాబు మాచర్లకు రాక

- సభాస్థలిని పరిశీలించిన బ్రహ్మారెడ్డి, మధుబాబు

మాచర్లటౌన్, మే7: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 11వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాచర్లకు రానున్నారు. మంగళవారం కూటమి అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబులు స్థలాన్ని పరిశీలించారు. రింగురోడ్డు, చిన కాన్వెంట్, అంబేద్కర్ సెంటర్ ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించి అనువైన ప్రదేశంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బండారు నాగేశ్వరరావు, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, వీరు, లింగయ్య, గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



వేమవరం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న లావు మేఘన

మచ్చలేని నాయకుడు శ్రీకృష్ణదేవరాయలు

- పల్నాడులో విద్య, వైద్యం, సాగునీటికి అవిరళ కృషి చేశారు
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ లావు సతీమణి మేఘన

మాచవరం, మే 7: గత ఐదేళ్లలో నరసరావుపేట ఎంపీగా పనిచేసి అనేక రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన అవినీతి మచ్చలేని నాయకుడు శ్రీకృష్ణదేవరాయలు అని ఆయన సతీమణి మేఘన తెలిపారు. నరసరావుపేట ఎంపిగా పల్నాడు ప్రాంతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అనేక రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత శ్రీకృష్ణదేవరాయలుకే దక్కుతుందని స్పష్టం చేశారు. మంగళవారం మాచవరం మండలం వేమవరం గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్నాడుప్రాంతంలో వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి, పిడుగురాళ్ల వైద్య కళాశాల నిర్మాణానికి, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారన్నారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక వ్యక్తి చేతనైనా తన భర్త అవినీతిపరుడని చెప్పిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటారని ఆమె సవాల్ విసిరారు. పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాలలో సొంత నిధులతో రైతులకు సంబంధించిన పొలాల లింకురోడ్లు అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వ, పార్టీపరంగా వ్యక్తిగతంగా అనేకమందికి సహాయ సహకారాలు అందించారన్నారు. శ్రీకృష్ణదేవరాయలు పల్నాడుప్రాంతంలో అందరి మన్ననలను, మనసులను గెలిచారని తెలిపారు. ఆమె ప్రచారకార్యక్రమానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుదె లక్ష్మీనారాయణ, మండల జనసేన అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, మీసాల నాగేశ్వరరావు, గోళ్ల గంగాధర్, అట్లూరి అంజిరెడ్డి, పొదిల నరసింహారావు, కామిశెట్టి సైదయ్య, మోమిన్ సైదావలి, పంపనీడి పుల్లయ్య, మద్దిరాల రమేష్, గెల్లా నాగేశ్వరరావు, గెల్లా ఆదాం, ఆతుకూరి శ్రీనివాసరావు, పూసల సత్యనారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

అమరావతి, పోలవరం విధ్వంసకులను ఓడిద్దాం

- టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు

అచ్చంపేట, మే 7: అమరావతి విధ్వంసం చేసి పోలవరాన్ని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడిద్దామని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెదకూరపాడు నియోజక వర్గంలో ఎమ్మెల్యే శంకరరావు ఓటమి తప్పదని, అందుకే అయన ప్రచారం కూడా మాని వేశాడని విమర్శించారు కుటుంబాల్లో కలహాలు సృష్టిస్తున్నాడని, ఆయన కుట్రలు పని చేయవన్నారు. అమరావతి నిర్మాణం టీడీపీతోనే సాధ్య మవుతుందన్నారు. జగన్ నేర వ్యవహారాలను అమలు చేస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డిని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లల్లో కోట్లాది రూపాయల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించారని, టీడీపీ అధికారంలోకి రావటంతో రద్దయిన 27 పథకాలను పునరుద్దరిస్తామని మాణిక్యరావు అన్నారు. సమావేశంలో బత్తుల శ్రీనివాసరావు, ఏసుపోగు నాగయ్య, గాలి శశిధర్, డి.అశోక్, చిలకా లక్ష్మయ్య పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

పెదకూరపాడు, మే 7: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చాక ప్రజలను నమ్మించి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. పెదకూరపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో బీసీలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయని అన్నారు. ఈ ప్రభుత్వం రూ.75 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిందని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు వైసీపీ ప్రభుత్వం 8.34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 పదవులు బీసీలకు దూరం చేశారని అన్నారు. బీసీలను దగా చేసిన జగన్మోహన్ రెడ్డికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు మోదుగుల చంద్రశేఖర్, డాక్టర్ అవ్వారు ప్రసాద్, కోరంపల్లి నరేంద్ర తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాష్యం నరసయ్య, మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు తదితరులు ఉన్నారు.

గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెంబర. 08323 సంబల్‌పూర్ - కాచీగూడ రైలు ఈ నెల 13, 20 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 1.30కి గుంటూరు, రాత్రి 9.50కి కాచీగూడ చేరుకొంటుంది. నెంబరు. 08324 కాచీగూడ -సంబల్‌పూర్ ప్రత్యేకరైలు ఈనెల 14,21 తేదీల్లో రాత్రి 11.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 4.35కి గుంటూరు, రాత్రి 11.45కి సంబల్‌పూర్ చేరుకొంటుంది. నెంబరు 07387 హుబ్లీ-నారాల గన్ ప్రత్యేక రైలు ఈనెల8నుంచి జూన్ 5వరకు ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.05కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక గురువారం 1.40కి గుంటూరు, శుక్రవారం రాత్రి 11 గంటలకు నారాలగన్ చేరుకొంటుంది. నెంబరు. 07388 నారాలగన్ - హుబ్లీ రైలు ఈ నెల 11 నుంచి జూన్ 8వ తేదీ వరకు ప్రతీ శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 8.50కి గుంటూరు, మంగళవారం ఉదయం 9గంటలకు హుబ్లీ చేరుకొంటుంది. నెంబరు. 07188 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 14వ తేదీ మంగళవారం ఉదయం 8గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా మధ్యాహ్నం 12.30కి గుంటూరు, సాయంత్రం 6.45కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది.

67,776 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 70,843 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 67,776 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 55,550 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
నెంబరు. 5	9000	14000
273	10000	13500
341	8500	16500
4884	9000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20300
బ్యాడిగి	9000	15500
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11000

అరాచక వైసీపీని
తరిమేద్దాం!

- ఐదేళ్ల వైసీపీ అహంకారానికి మరో నాలుగు రోజుల్లో తెరపడనుంది
- మాఫియా పాలనకు ముగింపు పలుకుదాం ..
- ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందాం
- గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని
- జోరు వానలోనూ ఎన్నికల ప్రచారం.. వెన్నంటే జనం

జోరు వర్షంలోనూ రోడ్‌షోలో పాల్గొన్న యరపతినేని



దాచేపల్లి, మే7: ఐదేళ్ల వైసీపీ అహంకారానికి మరో నాలుగు రోజులలో తెరపడబోతుందని, ఆ అరాచక ప్రభుత్వాన్ని తరిమివేద్దామని గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దాచేపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో యరపతినేని ప్రజలతో కలిసి ప్రయాణం చేశారు. జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యరపతినేని తన ప్రసంగాన్ని కొనసాగించారు. గురజాల నియోజకవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి, ఖైనీ, మద్యం, పేకాట, ఇసుక మాఫియా తప్ప మరే అభివృద్ధి జరుగలేదని ఎద్దేవా చేశారు. ఈ 'క్యాష్' మహేష్‌రెడ్డి అక్రమ మైనింగ్ క్వారీ గుంతల్లోపడి 8మంది చిన్నారులు మృతి చెందా రన్నారు. 11 మంది టీడీపీ నేతలను హత్య చేయించారన్నారు. ఆయనకు డబ్బు సంపాదనపై వున్న శ్రద్ధ ప్రజల సంక్షేమంపై లేదన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. అనంతరం నడికూడి, నారాయణపురం, ఇరికేపల్లి గ్రామాలలో యరపతినేని పర్యటించారు.



రోడ్‌షోలో పవన్ కల్యాణ్ చిత్రపటం చూపుతున్న యరపతినేని

జోరు వానలోనూ కొనసాగిన ప్రచారం ..

ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో ఏకదాటిగా వర్షం కురు స్తున్నా యరపతినేని శ్రీనివాసరావు తన ప్రచారాన్ని కొనసాగించారు. పల్నాడు ప్రజల దాహార్తిని తీర్చడానికి వరుణదేవుడు మనకు అండగా ఉన్నాడని, ఆయన మన పార్టీలో చేరాడని యరపతినేని అన్నారు. వర్షం లోనే దాచేపల్లిలోని నారాయణపురం, నడికూడి, ఇరికేపల్లి గ్రామాలలో యరపతినేని తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనతో పాటు వందలాది కార్యకర్తలు కూడా పార్టీ జెండాలు చేబూని వర్షంలో ఆయా గ్రామాలలోని ప్రచారాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నరసింహారెడ్డి, బెల్లంకొండ భద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, మాజీ సర్పంచ్ వలి, అక్కినపల్లి బాలయ్య, అంబటి నవకుమార్, శేషగిరిరావు, గుంటుపల్లి భరత్ కుమార్, తదితరులున్నారు.

కొనసాగుతోన్న చేరికల పర్వం ..

పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. మంగళవారం వైసీపీకి చెందిన దాచేపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కందుల జాన్ దగ్గర బంధువులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సారంగపల్లి అగ్రహారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరగా ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే కరాలపాడు లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కొందరు, దాచేపల్లి పట్టనం 8వ వార్డుకు చెందిన బీసీ, ఓసీ వర్గాలకు చెందిన వారు, తుమ్మలచెరువు గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు



టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన దాచేపల్లి ఎంపీపీ బంధువులు

వైసీపీ ఐదేళ్ల పాలనలో
రాష్ట్రం అధోగతి

- రోడ్ షోలో కొమ్మాలపాటి, భాష్యం ప్రవీణ్
- పాల్గొన్న భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తరలి వచ్చిన జనం

పెదకూరపాడు,మే7: టీడీపీ పాలనలో అభివృద్ధి బాట పట్టిన రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో అధోగతి పాలుచేశారని, ఈ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెపాల్పలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌లు పిలుపు నిచ్చారు. మంగళవారం పెదకూరపాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ రోడ్‌షో నిర్వహించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఈ రోడ్‌షోలో కొమ్మాలపాటి, ప్రవీణ్‌లతో కలసి పాల్గొన్నారు. జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు, వేలాదిగా రోడ్‌షోలో పాల్గొన్నారు.

కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ వైసీపీకి ఒక్క ఛాన్స్ ఇస్తే వారు అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేశారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటం చేత గాక జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ప్రజలను మోసం చేసేందుకు రోజుకో ఎత్తులు వేస్తున్నారని, ప్రజలు వారి మాటలను నమ్మవద్దన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజలు వారి భూములపై హక్కు కోల్పోయే ప్రమాదముందన్నారు. కూటమి మేనిఫెస్టోతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. 13న జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రోడ్ షోకు వేలాది మంది తరలిరావటం చూస్తుంటే తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏమి లేదని, దోచుకోవటం, దాచుకోవటమే లక్ష్యంగా ఆ పార్టీ ఎమ్మెల్యే పాలన చేశారన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందు బాటులో ఉంటానని, వారి కష్టాలను తీర్చుతానని అన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు మన మేనిఫెస్టోను ఓటర్లకు వివరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న కొమ్మాలపాటి, పక్కన భాష్యం ప్రవీణ్, భాష్యం రామకృష్ణ

ముందుగా గ్రామస్థులు బాణసంచా కాల్పులతో, తీర్మార్ వాయిద్యాలతో, పూలమాలలతో నేతలకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభ మైన రోడ్ షో మిట్ట ప్రాంతాల వరకు కొనసాగింది. కార్యక్రమంలో నియోజకవర్గ యువ నేత కొమ్మాలపాటి సాయిసుధాకర్, పఠాన్ నూర్జహాన్, ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు, అర్తిమళ్ల రమేష్, భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబురావు, షేక్ మిలటరీ మౌలాలి, నెల్లూరి మల్లికార్జున్, మక్కెన్ సాగర్, షేక్ అజ్మల్లా, షేక్ ముంతాజ్, షేక్ రఫీ, మేదరమెట్ల సౌమిత్ చౌదరి, వడ్లమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెల నుంచే రూ.4 వేలు పింఛన్ ..

క్రోసూరు : టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఏప్రిల్ నుంచే నెలకు రూ.4వేలు పింఛన్‌ను అందజేస్తామని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం క్రోసూరు మండలం అందుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు కుటుంబాల వారు ప్రవీణ్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలోని అన్ని అంశాలు అధికారంలోకి వచ్చిన మొదటి రోజునుంచే అమలు చేస్తామన్నారు. మే 13న సైకిల్‌గుర్తుపై ఓటు వేయటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి వైసీపీ శ్రేణులు వెల్లువలా వచ్చి టీడీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన నాయకులందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ దిగుమత్తి అప్పారావు, వాసిరెడ్డి వీరభద్రం, చావా మురళీ, వాసిరెడ్డి మురళీ, వెంకటరావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో రోడ్‌షోకు భారీ సంఖ్యలో హాజరైన కూటమి శ్రేణులు



అందుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్

కార్యకర్తలే నా ధైర్యం

- ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి..
- నా పాలన ఏంటో మీరే చూస్తారు : జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మే 7: కార్యకర్తలే నా ధైర్యం. వారే శ్వాస, ఆశ. వారి సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తా.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రజలు నాలుగు సార్లు అవకాశమిచ్చారు. ఆయన ఏం చేశాడు? రౌడీయిజం, గుండాయిజాన్ని ప్రోత్సహించాడు. గ్రామాల్లో ప్రజలు తాగడానికి నీళ్ల కూడా ఇవ్వలేకపోయాడు. నాకు ఒక్కసారి అవకాశమివ్వండి.. ఎమ్మెల్యేగా గెలిపించండి.. నా పాలనేంటో మీరే చూస్తారు' అని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం రెంటచింతల రేగులమాణ్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మట్లాడుతూ.. నివేశనాస్థలాలు ఎక్కడో ఇచ్చారు. ఒక్క ఇళ్ల కట్టించారా? సర్వం పిన్నెల్లి సోదరుల దోపిడి మయం అంటూ ధ్వజమెత్తారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, మాట తప్పితే నిలదీయండని కోరారు. ముందుగా గ్రామంలోని అలయంలో పూజలు నిర్వ హించి అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డిమండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మర్రి రాజ్‌కుమార్, శివయ్య, ఎనిగండ్ల రమేష్, ఆదూరి శివ, బోడపాటి రామకృష్ణ, కాయితి రవి కృష్ణారెడ్డి, కొండలు, మల్లయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



రేగులమాణ్యంలో ప్రసంగిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక..

మాచర్ల రూరల్/కారంపూడి: మండలంలోని నాగులవరంకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాంబయ్య, గోవిందు, లక్ష్మయ్య, గన్నెబోయిన శ్రీను, దుర్గయ్య, గోవర్ధన్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గన్నెబోయిన వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గన్నెబోయిన లింగరాజు, కృష్ణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, లింగయ్య, మల్లికార్జున, బ్రహ్మయ్య, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి పట్టణానికి చెందిన తోటనరసింహారావు, పలిశెట్టి రాఘవ, కొండ, పెనుగొండ బ్రహ్మం, కటికల బాలకృష్ణ, గుండాల నరసింహారావు ఆధ్వర్యాన వైసీపీకి చెందిన 60 కుటుంబాలు మాచర్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలోచేరాయి. పార్టీలో చేరిన వారిలో జక్కా నరసింహారావు, పలిశెట్టి హనుమంతురావు, నూకబత్తిన సాంబయ్య, గోగులదిన్నె రమణారెడ్డి, కాలే మల్లేశ్వరరావు, బద్దల హనుమంతురావు, రామాంజినేయులు తదితరులు ఉన్నారు. అలాగే మాల మహానాడు నాయకులు కాలే మల్లేశ్వరరావు, పుల్లారావుతో పాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

అధికారంలోకి రాగానే అమరావతి అభివృద్ధి

- వైసీపీ నేతలు దోచుకోవటానికే మూడు రాజధానులు
- అభివృద్ధిని విస్మరించిన జగన్‌ను సాగనంపుదాం ..
- సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం,మే7: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే రాజధాని అమరావతిని అభివృద్ధి చేయనున్నట్లు సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని అనుపాలెం, అంచులవారిపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాగానే ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చివేశాడని, పేదలకు పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసివేసాడని ఆవేదన వ్యక్తంచేశారు. అమరావతి రాజధానిని ఇక్కడ నుంచి తరలించకుండా, అభివృద్ధి చేసి ఉంటే ఎంతో మందికి ఉపాధి దొరికేదిదన్నారు. ఇక్కడ రైతులు ఇచ్చిన 35 వేల ఎకరాలు భూమిని పాడుపెట్టి విశాఖపట్నం వెళ్లింది దోచుకొని, దాచుకోవడానికే కదా? అని ప్రశ్నించారు. ఇక్కడి ఎమ్మెల్యేను మీరు ఓట్లువేసి గెలిపించింది రాజుపాలెంలో పొలం కొనుక్కొని, అందులో స్విమ్మింగ్‌పూల్ కట్టించుకొని ఈత కొట్టడానికికాదని, ఈ ఐదేళ్లలో నియోజకవర్గానికి, మీ గ్రామానికి ఏంచేశాడని మండిపడ్డారు. మరోసారి ఓటు అడిగేందుకు వస్తే నిలదీయండని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మీ సంక్షేమంతో పాటు మీ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులైన తనను, లావు శ్రీకృష్ణదేవరాయులను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కన్నా తొలుత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య, మండల మహిళ అధ్యక్షులు నెల్లూరి అహల్యారాణి తదితరులు ఉన్నారు.



అనుపాలెం ఎన్నికల ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాలర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరిక..

ముప్పాళ్ళ: మండలంలోని ఇరుకుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలవారు బలిజేపల్లి డేవిడ్ ఆధ్వర్యంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా నాగరాజు పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ దరువూరి శ్రీనివాసరావు, టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిఫ్ట్‌ల ఆశ చూపి ఆత్మీయ సమావేశానికి పిలుపు

- కూపన్లు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై మహిళల మండిపాటు

పిడుగురాళ్ల, మే 7: 'ఆత్మీయ సమావేశం వుంది.. మీ అందరూ వస్తే కూపన్లు ఇస్తాం.. అదృష్టం కలిసొస్తే మంచి గిఫ్టులు అందజేస్తాం..' అంటూ వైసీపీకి చెందిన పట్టణ ఆర్యవైశ్య నేతలు రెండు రోజుల క్రితం కొందరికి పిలుపునిచ్చారు. ఆదివారం పిడుగురాళ్లలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరుగుతుందంటూ అధికార పార్టీకి చెందిన వైసీపీ నేతలు కొందరికి పిలుపు అందించారు. పురుషులతో పాటు మహిళలు రావాలని, అలా వచ్చిన వారికి కూపన్లు అందజేసి లాటరీ ద్వారా గిఫ్టులు అందజేస్తామంటూ సమాచారం చేరవేశారు. గిఫ్టులు కదా ఏదో ఒకటి ఇవ్వకపోతారా అంటూ కొందరు మహిళలు కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం అయ్యాక కూపన్లు కొందరికి చేతిలో పెట్టి ఎన్నికలు అయ్యాక పట్టణంలోని ఫలానా ఎలక్ట్రికల్ షాపుకు వెళ్లి మీ కూపన్ ద్వారా వస్తువులు తీసుకోవచ్చంటూ చెప్పడంతో 'సమావేశంలోనే గిఫ్టులు ఇస్తామని చెప్పి, తీరా సమావేశం అయ్యాక ఎన్నికల తర్వాత అంటారేంటి' అని కొందరు మహిళలు బాహాటంగానే అసహనం వ్యక్తం చేస్తూ వైసీపీ నేతలను విమర్శించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

కారంపూడి, మే 7: జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం టీడీపీ నేతలు మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, మండల అధ్యక్షుడు కేశనపల్లి కృష్ణబాబు, సీనియర్ నేత కర్నా అమర సైదారావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

- వైసీపీ నేతల సమాచారంలో ట్రాఫిక్ వాహనం నిలిపివేత
- తనిఖీ పేరుతో మాచర్ల సీఐ, ఎస్ఐ నానా యాగీ

మాచర్ల టౌన్, మే 7: ప్రైవేటు వాహనాన్ని తనిఖీ పేరుతో పోలీసులు హల్‌చల్ చేశారు. గుంటూరు నుంచి మాచర్ల వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సును వైసీపీ నేతలిచ్చిన సమాచారంతో పోలీసులు రెంటచింతలలో అడ్డుకున్నారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు, రెంటచింతల ఎస్‌కేవీ నారాయణరెడ్డిలు ఆ బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తదుపరి రెంటచింతల ఎస్ఐ ఎస్కార్ట్‌తో బస్సును మాచర్ల పట్టణంలోని ఎన్నికల అధికారి కార్యాలయానికి తరలించారు. ఆర్వో శ్యాంప్రసాద్ రావడం రెండు గంటలు ఆలస్యమవడంతో తనిఖీలు పేరుతో మాచర్ల పట్టణ సీఐ శరత్‌బాబు, రూరల్ సీఐ సురేష్‌లు నానా యాగీ చేశారు. తీరా ఆర్వో శ్యాంప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బస్సులో ఎటువంటి అభ్యంతరకరమైన ప్రచార వస్తువులు లేవని, తెల్లకాగితం స్లిప్‌లు గుర్తించామని, ప్రస్తుతానికి వాటిని సీజ్ చేయాలని పోలీసులకు సూచించినట్లు చెప్పారు. అనంతరం బస్సును, అందులోని వ్యక్తులను పంపించి వేశారు.



భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన అత్తలూరు సర్పంచ్ సరోజిని తదితరులు


అమరావతిలో వైసీపీకి భారీ షాక్

- టీడీపీ, బీజేపీ, జనసేనలోకి భారీగా చేరికలు

అమరావతి, మే 7: పెదకూరపాడు నియేజకవర్గ పరిధిలోని అమరావతి మండ లంలో అధికార పార్టీ వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు రోజురోజుకు ఆపార్టీని వీడుతూ వైసీపీ నాయకత్వానికి వణుకు పుట్టిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరు గ్రామ సర్పంచ్ బంకా సరోజిని తో పాటు కుటుంబసభ్యులు ఉమ్మడికూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరడం జరిగింది. అదేవిధంగా ధరణికోట కు చెందిన పది కుటుంబాలు ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అమరావతికి చెందిన 20కుటుంబాలు బిజేపీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది. అమరావతిలోని మిట్టమీద రామాలయం సమీపంలోని 25కుటుంబాలు జిల్లా జనసేన అధ్యక్షులు గాదే వెంకటేశ్వరరావు సమక్షంలో జనసేనలో చేరారు.

60 కుటుంబాలు టీడీపీలో చేరిక

బెల్లంకొండ, మే 7 : ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేయ గల సత్తా నారా చంద్రబాబు నాయుడుదేననే నమ్మకంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. మంగళవారం ఉదయం మండల కేంద్ర మైన బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో బెల్లంకొండ మండలం యమ్మాజీగూడెం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అదే విధంగా చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో లక్ష్మీనారాయణ, వెంకట రామిరెడ్డి, వర్ల వెంకటేశ్వర్లు, గొట్టం రమేష్, శ్రీను, ఆంజనేయులు, రామకృష్ణ, గుంజా గంగారావు, మధు, హనుమంత రావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన యమ్మాజీగూడెంకి చెందిన వారు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

సత్తెనపల్లి, మే 7 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. పలువురు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. కొంత మంది తాము నియోజక వర్గంలో నివాసం ఉంటున్న తమకు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఫారం - 12డీ ఏర్పాటు చేస్తే వెంటనే ఓటు హక్కు కల్పిస్తామని అధికారులు చెప్పటంతో కొంత మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయని వారు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పొరుగు జిల్లాల్లో ఓటర్లుగా ఉండి ప్రస్తుతం జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు కూడా ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు. ఓటర్లు తమ స్వస్థలాలకు వెళ్ళి ఓటు వేసే బదులు ఇక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చని అధికారులు తెలిపారు.

వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయమే

- బీసీ సంఘ నేతల మండిపాటు

పిడుగురాళ్ల, మే 7: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు పెరిగాయని బీసీ సంఘ నేత, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురకా వీరస్వామి మండిపడ్డారు. మంగళవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో బీసీలకు విదేశీ విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. బీసీ సంఘ రాష్ట్ర నేత దూళిపాళ్ల ఏసుబాబు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో వడ్డెరలు క్వారీలలో కూలీలుగా మారారని మండిపడ్డారు. సమావేశంలో వడ్డెర సంఘ నేతలు వేముల అంజనేయులు దేవళ్ల వెంకట్, కుంచపు గంగరాజు, మరికొంత మంది నేతలు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ నేతల సమావేశం

బెల్లంకొండ, మే 7 : బెల్లంకొండ మండలంలోని న్యూ చిట్యాల టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ మడల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన బీసీ సంఘం నేతల సమావేశం నిర్వహించారు. వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలకు డిక్లరేషన్ కల్పించారన్నారు. బీసీలు టీడీపీకి అండగా ఉండాలన్నారు. ఈ ఎన్నికల్లో లావు శ్రీ కృష్ణ దేవరాయలను, భాష్యం ప్రవీణ్‌ను గెలిపించు కోవాలని సూచించారు. సమావేశంలో బీసీ నేతలు పలువురు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ జంగా, నిఖిల్, వెంకట కోటయ్య తదితరులు

బీసీలకు గుర్తింపులేదనే వైసీపీని వీడాను

- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, మే 7: వైసీపీలో బీసీలకు తగిన గుర్తింపు, మర్యాద లేదనే ఆ పార్టీని వీడానని ఎమ్మెల్సీ, టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పిడుగురాళ్లలో యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, పార్టీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు రెండో ఛాన్స్ ఇస్తే మన ఆస్తులు గల్లంతు అవుతాయన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన ఆస్తులు వైసీపీ నేతల సొంతమవుతాయన్నారు. వైసీపీలో కొనసాగినంత కాలం అక్కడ ఓ సామాజికవర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తారు తప్ప బీసీలంటే చులకనగా చూస్తారన్నారు. సరైన గౌరవం, గుర్తింపు లేదని ఆవేదన చెందే ఆ పార్టీని వీడి టీడీపీలో చేరానన్నారు. గురజాలలో కాసు మహేష్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు, అక్రమాలకు అడ్డుగా వున్నాననే నన్ను ఒంటరినిచేసి పార్టీ వీడేలా చేశారన్నారు. ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలుకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావుకు ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, మద్దాళి సుబ్బయ్య, రెడ్డి సాంబశివరావు, వనజా సాంబశివరావు, ఆలేటి మల్లిఖార్జునరావు, దియ్యా శ్రీను, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, ఆత్మకూరి కాశి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: వైసీపీలో బీసీలకు సముచిత స్థానం కానీ, గౌరవం కానీ, గుర్తింపు కానీ లేదని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. మంగళవారం గామాలపాడులోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ.. నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ నాకు ఎంపీ సీటు ఇప్పిస్తానని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కష్టపడ్డాం కాబట్టే పదవులు వచ్చాయికాని ఎవరి దయా దాక్షిణ్యంతో కాదన్నారు. సీఎం రాజశేఖర్‌రెడ్డికి, సీఎం జగన్మోహన్‌రెడ్డికి నక్కకు నాగలోకానికి వున్నంత తేడా ఉందన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు భారీ మెజారిటీతో గెలుస్తారని తెలిపారు.

- మీ పెమ్మసాని



సదా.. మీ సేవలో



గుంటూరు లోక్‌సభ నియోజకవర్గంలో ఆయన తొలిఅడుగు అదిరిపోయింది. అధికార వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. ముగ్గురు అభ్యర్థులను మార్చింది. రాజకీయాలకు కొత్త అయినా ఏమాత్రం తడుముకోకుండా ధీటుగా వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆయనే డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్. ఆయన ప్రచార సరళి, ఆయన సభలకు వస్తున్న జనస్పందన చూస్తే గెలుపుకాదు, ఎంత భారీ మెజార్టీ అనేదే ఇప్పుడు అంతా చర్చించుకొంటున్నారు. ఏళ్ల తరబడి అమెరికాలో ఉన్నా ఆ భాషని ఎక్కడా ఉపయోగించకుండా అచ్చ తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకొంటున్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ప్రజా సేవకోసమే మాతృభూమికి వచ్చాను..
- నా డబ్బును కాదు.. నా క్యారెక్టర్ చూసి భయపడుతున్నారు..
- ఐదేళ్లుగా ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు
- జగన్ అంటేనే భయపడిపోతున్నారు
- ఇంత ప్రజా వ్యతిరేకత మూటగట్టుకొన్న ప్రభుత్వాన్ని చూడలేదు
- భారీ మెజార్టీలతో టీడీపీ అభ్యర్థుల గెలుపు ఖాయం
- ఉద్యోగులు 90 శాతం మాకే ఓట్లు వేస్తున్నారు
- ఆంధ్రజ్యోతితో టీడీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్... తెలుగుదేశం పార్టీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి. ప్రస్తుతం ఈ పేరు జిల్లాలోనే కాదు, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా మార్మోగుతోంది. జాతీయ మీడియా సైతం ఆయన ఇంటర్వ్యూల కోసం వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇక్కడికి వస్తోంది. అంతలా ఆయన క్రేజ్ సంపాదించుకొన్నారు. కిందిస్థాయి నుంచి కష్టపడి మెట్టుమెట్టు ఎక్కుతూ ఆయన ఎదిగారు. అమెరికాలో రూ.వేల కోట్ల సంపాదన, విలాసవంతమైన జీవితం. ఇవన్నీ వదులుకొని ప్రజాసేవ కోసం మాతృభూమికి తరలివచ్చారు. ఆయన మనోభావాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న: ప్రజా స్పందన మీకు ఎలా ఉంది?

జవాబు: ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో అభివృద్ధి లేదు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇలానే ఉంటే రాష్ట్రాన్ని సీఎం జగన్ అమ్మేస్తాడన్న భయం ప్రజల్లో ఏర్పడింది. దాంతో గత ఎన్నికల్లో ఆయనకు అండగా నిలిచిన వివిధ వర్గాలు ఇప్పుడు మాకు నీరాజనాలు పడుతున్నాయి.

ప్రశ్న: ప్రజలు ఎక్కువగా ప్రస్తావిస్తున్న సమస్యలు ఏమిటి?

జవాబు: ఎక్కడికెళ్లినా ప్రజలు నాలుగే సమస్యలపై అడుగుతున్నారు. తాగునీరు లేక గ్రామాల్లో అల్లాడుతున్నారు. రోడ్లు వేయడం అనేది వైసీపీ ప్రభుత్వం మరిచిపోయింది. కేవలం 20, 30 చదరపు గజాల ఇళ్లల్లో ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నారు వారంతా తమకు సొంత ఇల్లు ఉండాలని కోరుకొంటున్నారు. డ్రైనేజీ సమస్య నియోజకవర్గం అంతటా తాండవిస్తోంది. చివరగా మా పిల్లలకు ఉద్యోగాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రశ్న: మీ వద్ద ఉన్న పరిష్కార మార్గాలేమిటి?

జవాబు: తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ పథకాన్ని అందిపుచ్చుకోవాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ పరంగా మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయాలి. దానిని మా అధినేత మేనిఫెస్టోలో పెట్టారు. దాంతో ఇంటింటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చి తీరుతాం. రోడ్లు అనేవి అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల్లో ఒకటి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చి ఎక్కడైతే రోడ్లు దెబ్బతిని ఉన్నాయో వాటిని దశలవారీగా నిర్మిస్తాం. మూడో దశలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెడతాం. ఇళ్లు లేని వారికి కచ్చితంగా పక్కా ఇల్లు నిర్మించి ఇస్తాం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు ఎన్ఆర్ఐల సహకారం తీసుకొంటాం. ఉద్యోగాల కల్పన కోసం పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురావడానికి కృషిచేస్తాను. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రాబోయే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పనకు గట్టిగా ప్రయత్నిస్తా.

ప్రశ్న: రాజకీయాల్లో తొలి అడుగు ఎలా ఉంది?

జవాబు: నా తొలి అడుగు దద్దరిల్లిపోతోంది. గతంలో మా పార్టీకి ప్రతికూల పరిస్థితులున్న ఫిరంగిపురం లాంటి మండలాల్లోనూ విపరీతమైన జనాదరణ లభిస్తోంది. ప్రచారానికి వెళితే అందరూ రోడ్ల పైకి వచ్చి ఆశీర్వదిస్తున్నారు. గుంటూరు తూర్పులో ముస్లిం మైనార్టీలకు ఒక భరోసా ఇవ్వగలిగాం. దీంతో ఈ దఫా అక్కడ 20 వేల ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నాం. ఈ విధంగా ఏ నియోజకవర్గం చూసినా వార్ వన్‌సైడ్ లానే ఉంది.

ప్రశ్న: మీ సొంతంగా చేయబోయే కార్యక్రమాలు వివరించండి?

జవాబు: విద్య విషయానికి వస్తే ఇప్పటికే నా సొంత డబ్బుతో తెనాలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాల నెలకొల్పడం జరిగింది. అతి త్వరలో నియోజకవర్గంలోని మిగతా ఆరు అసెంబ్లీ హెడ్‌క్వార్టర్స్‌లలో పాఠశాలలు స్థాపిస్తాం. ఆరు నెలల్లోనే స్థలాలు సేకరించి ఏడాది వ్యవధిలో పాఠశాలల నిర్మాణం పూర్తి చేస్తాం. వాటిల్లో 25 శాతం మందికి పూర్తి ఉచితంగా విద్య, 50 శాతం మందికి నామమాత్రం ఫీజులు, మిగతా 25 శాతం మందికి ఫీజులు కాస్త ఎక్కువ మొత్తంలోనే నిర్ణయిస్తాం. వీటిని రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తాం.

ప్రశ్న: జనసేన పొత్తు ఏ విధంగా ఉపయోగపడుతుంది?

జవాబు: జనసేన పార్టీతో పొత్తు మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పటికే 80శాతం ఓటు బదిలీ జరిగింది. నేను ఏదో అమెరికా నుంచి వచ్చాను. మళ్లీ వెళ్లిపోతాను... అని కొంతమంది వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, నేను ప్రజలకు తెలిసిన వాళ్లం. ఎప్పుడెప్పుడు పోలింగ్ తేదీ వస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇంత వ్యతిరేకత మూటగట్టుకొన్న ప్రభుత్వాన్ని గతంలో నేను ఎప్పుడూ చూడలేదు. ముఖ్యంగా ప్రజల్లో భయం వచ్చింది. పోస్టల్‌బ్యాలెట్‌లో 90 శాతం ఓట్లు మాకే పడుతున్నాయి.

ప్రశ్న: సీఎం జగన్ ఆరోపణలపై మీ స్పందన ఏమిటి?

జవాబు: జగన్‌కి తన పార్టీ ఓడిపోతుందని అర్థమైపోయింది. అందుకే ఆయన బేల మాటలు పలుకుతున్నాడు. తనని ఎవరో చంపేయబోతున్నారని అంటున్నారు. అధికారులను బదిలీ చేస్తున్నారు... ఈ ఎన్నికలు సక్రమంగా జరుగుతాయన్న నమ్మకం లేదని మాట్లాడుతున్నారు?

ప్రశ్న: మంగళగిరిలో మీ పార్టీ పరిస్థితి ఈ సారి ఏమిటి?

జవాబు: నారా లోకేశ్ మంగళగిరిలో 40 వేల నుంచి 60 వేల ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నారు. అక్కడ మాకు, వైసీపీకి మధ్యన 20 శాతం ఓట్ల వ్యత్యాసం ఉంది. ఓటింగ్ శాతం ఎంత ఎక్కువ జరిగితే అంత ఎక్కువ మెజార్టీ వస్తుంది.

ప్రశ్న: వైసీపీ నాయకులు మీపై చేస్తున్న ఆరోపణలపై మీ స్పందన చెప్పండి?

జవాబు: వైసీపీ వాళ్లు నన్ను రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాక ఫేక్ ఆడియో, వీడియోలు విడుదల చేసి నాపై దుష్ప్రచారం చేస్తున్నారు.

ప్రశ్న: రాజకీయాలకు కొత్త అయినా ప్రత్యర్థులను ఎలా కౌంటర్ చేస్తున్నారు?

జవాబు: జగన్ ఏదైనా మాట్లాడాలంటే స్క్రిప్టు కావాలి. నాకు అవసరం లేదు. సమస్యల మీద స్పందించే హృదయం, జ్ఞానం ఉంటే ఎవరికైనా స్క్రిప్టు అవసరం లేదు. పదునైన అస్త్రాలను సంధించ వచ్చు.

ప్రశ్న: ప్రచారంలో ఏ వర్గాలను ఎక్కువగా కలుసుకొంటున్నారు?

జవాబు: నేను ఎక్కడికి వెళ్లినా అట్టడుగు వర్గాలతోనే ఎక్కువగా మాట్లాడుతుంటాను. దాంతో వారి సమస్యలపై నాకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఆ తర్వాత వాటి పరిష్కారానికి ఆలోచన చేస్తున్నాను.

ప్రశ్న: ఇప్పటివరకు జరిగిన ప్రచార తీరుని వివరిస్తారా?

జవాబు: 300 గ్రామాల్లో ఇప్పటివరకు పర్యటించి బహిరంగ సభలు పెట్టాను. ఇంకా వెళ్లాల్సిన గ్రామాలు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు ఎవరూ తిరగనన్ని గ్రామాలకు వెళ్లాను. చాలా గ్రామాల్లో అయితే 25 ఏళ్లుగా ఎంపీ అభ్యర్థులను చూడలేదని ప్రజలు చెబుతున్నారు. నేను గెలిచిన తర్వాత ప్రతీ గ్రామాన్ని రాబోయే ఐదేళ్లలో ఒకటి రెండుసార్లు సందర్శించి అక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటాను. ఇళ్లని ఎంత తక్కువ ఖర్చుతో నిర్మించవచ్చు. వారికి ఎన్ఆర్ఐలను లింకు చేయడం వంటి చర్యలు చేపట్టి సొంత ఇల్లు కలని సాకారం చేస్తాను.

ప్రశ్న: సూపర్‌సిక్స్ హామీలలో ఎక్కువగా ప్రజలు దేనికి స్పందిస్తున్నారు?

జవాబు: పింఛన్ రూ.4 వేలకు పెంచి ఇస్తానని మా అధినేత ఇచ్చిన హామీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. ఇది అందరిపై ప్రభావం చూపుతున్నది. అలానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితం, ప్రతీ పిల్లవాడికి చదువుకు రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. వీటికి ప్రజలు బాగా ఆకర్షితులయ్యారు.

ప్రశ్న: మీ గెలుపు కోసం కష్టపడుతున్న వారికి మీరు గెలిచాక ఏమి చేస్తారు?

జవాబు: టీడీపీ వాళ్లు ఎవ్వరూ స్వలాభం కోసం చూడరు. ఇది మా పార్టీకి ఉన్న ప్రత్యేకత. ప్రధానంగా వాళ్ల గౌరవాన్ని కోరుకొంటారు. వారి పిల్లలకు సరైన ఉద్యోగాలు రావాలని ఆశిస్తారు. మా గెలుపు కోసం కష్టపడిన వారికి అధికారంలోకి వచ్చాక ఏమి చేయాలనేది ఆలోచిస్తాం.

ప్రశ్న: ఇంత తక్కువ సమయంలో ప్రజల మద్దతు ఎలా పొందారు?

జవాబు: గత కొన్నేళ్ల నుంచి ప్రజలు ధైర్యంగా నిలబడే నాయకుడి కోసం ఎదురు చూస్తున్న సమయంలో నేను ఇక్కడ ఎంపీ అభ్యర్థిగా వచ్చాను. దాంతో వారు నన్ను విపరీతంగా ఆదరిస్తున్నారు. సమస్యల ఊబిలో ఉన్న వాళ్లకు నేను ఒక ఆశాదీపంలా కనిపిస్తుండటం వలనే ఈ రెండు నెలల్లో నాకు ఇంత ప్రజాదరణ రావడానికి కారణంగా ఉంది.

ప్రశ్న: వైసీపీ వాళ్లు మిమ్మల్ని చూసి భయపడటానికి కారణం ఏమిటి?

జవాబు: డబ్బు అనేది నా వద్దనే కాదు ఎవరి వద్దనైనా ఉంటుంది. ఆ మాటకు వస్తే జగన్ వద్ద ఉన్న డబ్బు వేరే వ్యక్తి వద్ద లేదు. నా వద్ద ఉన్న డబ్బు చూసి కాదు.. ..నా క్యారెక్టర్ చూసి వాళ్లు కంగారు పడుతున్నారు.

30 ఏళ్లుగా.. అదే వాహనం



- యరపతినేని సెంటిమెంట్ వాహనంలో ప్రచారం

పిడుగురాళ్ల, మే7: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార వాహనం సెంటిమెంట్ వుంది. 1994 ఎన్నికల నుంచి 2024 ఎన్నికల వరకు అదే వాహనంలో అన్ని గ్రామాలు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత 30 ఏళ్లుగా గురజాల నియోజకవర్గంలో ఎన్నికల సమయంలోనే ఆ వాహనం యరపతినేని వాడతారు. నామినేషన్ రోజు నుంచి ఎన్నికల ప్రచారం ముగిసే వరకు అదే వాహనం యరపతినేని వాడటం అలవాటు చేసుకున్నారు. గెలిచినా.. ఓడినా వాహనాన్ని మాత్రం వీడటం లేదు. మొత్తం మీద యరపతినేనికి సెంటిమెంట్ కలిసొచ్చే వాహనం నుంచే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.



ప్రచార వాహనం నుంచి మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు, ఇన్‌సెట్లో ఎన్నికల ప్రచార వాహనం

అపూర్వ ఆదరణ

- కన్నాకు నీరాజనాలు పడుతున్న ప్రజలు

రాజుపాలెం మండలంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ





అనుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి మే 7: కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారంలో బాగంగా నియోజకవర్గంలో ఏగ్రామానికి వెళ్ళినా ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మ్యానిఫెస్టోలో ప్రతి ఒక్కరికి ప్రయోజనం లభిస్తుందని ప్రచారంలో ఆయన ప్రజలకు వివరిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాలను గురించి తెలియజేస్తున్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప అభివృద్ధి శూన్యం అని చెబుతున్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి నవరత్నాలు అంటూ అందరినీ మోసం చేశారని విమర్శిస్తున్నారు. సైకో జగన్ పాలనకు శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టాలని పిలుపునిస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు, వడ్డీలేని రుణాలు అభిస్తాయని తెలిపారు. విజన్ కలిగిన సీనియర్ నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ దౌర్జన్య పాలన అంతం కావాలని, టీడీపీ సంక్షేమ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన ప్రచారంలో పేర్కొంటున్నారు. ప్రజల ఆశలన్నీ నెరవేరే రోజులు కొద్దిరోజుల్లోనే ఉందన్నారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రచారంలో భాగంగా అనుపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజుపాలెం మండలంలో ఇంటింటి ప్రచారంలో ప్రజలు హారతులిస్తూ పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. రాజుపాలెం మండలానికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలును గెలిపించాలని పిలుపునిచ్చారు. అనుపాలెం, అంచులవారిపాలెం, కొండమోడు గ్రామాల్లో కన్నా లక్ష్మీనారాయణకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కన్నాకు ప్రజలనుంచి వస్తున్న స్పందన చూస్తుంటే బారీ మెజారిటీతో కన్నా విజయం ఖాయం అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రజలతో మమేకం

- డాక్టర్ అరవిందబాబుకు అపూర్వ ఆదరణ
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం

నరసరావుపేట, మే7: ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవింద బాబుకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలుకుతున్నారు. ప్రజలతో మమేకమవుతూ అరవింద బాబు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రొంపిచర్ల మండలం కర్లకుంట, పట్టణంలోని 12 వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు కోసం బాబును మళ్లీ రప్పిద్దాం. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించి, సంపద సృష్టించి ఆ సంపదను ప్రజలకు పంచే లక్ష్యం కలిగిన ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తోడుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ లాంటి విధానాలతో రాష్ట్రాన్ని, ప్రజల సంపదను దోచుకోవాలని జగన్‌రెడ్డి చూస్తున్నాడని, కానీ ప్రజల సంపద పెంచి ప్రజలకు అండగా నిలుస్తానని ప్రకటించిన నాయకుడు చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో డీఎస్సీ నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తానని, తొలి వందరోజుల్లోనే గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపి యువతను రక్షించుకుంటానని ప్రకటించిన దమ్మున్న నాయకుడు చంద్రబాబు మాత్రమేనని చదలవాడ అన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రతి సమస్యనీ పరిష్కరించి సామాన్యులకు అండగా నిలుస్తానన్నారు. నియోజకవర్గంలో భూకబ్జాలు అరికట్టి, తాగుసాగునీటి సమస్యలు పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ రెండు సెంట్ల స్థలం ఇచ్చి,ఇల్లు కట్టించి అందిస్తానని భరోసా ఇచ్చారు. కర్లకుంటలో 70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికి అరవిందబాబు, నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహన్‌కృష్ణ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి అహ్వానించారు. 12 వార్డులో మాజీ కౌన్సిలర్ నేలటూరి నాయకత్వంలో పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.



రొంపిచర్ల మండలం కర్లకుంటలో టీడీపీలో చేరిన 70 కుటుంబాలు



12వ వార్డులో అరవిందబాబు సమక్షంలో టీడీపీలో చేరికలు

టీడీపీలోకి వలసల జోరు

పెదకూరపాడు, మే 7: టీడీపీలోకి వలసల జోరు ఊపందుకుంది. రోజురోజుకి వైసీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో టీడీపీలోకి చేరుతున్నారు. కూటమి పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల్లోని వైసీపి ముఖ్యనేతలు, కార్యకర్తలు టీడీపీలోకి పెద్దసంఖ్యలో చేరుతున్నారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి విజయంతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమన్నారు. రోజురోజుకు టీడీపీకి ఆదరణ తానూ ఊహించినదానికన్నా ఎక్కువగా ఉందని, రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని అన్నారు. అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలన్నా కూటమి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ సామాజిక సేవకుడు అయిన ప్రవీణ్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలనే అలోచనలో ప్రజలున్నారని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.





పెదకూరపాడు అమరావతి మండలాలలో టీడీపీలోకి చేరిన వైసీపీ నేతలు,కార్యకర్తలు

బొల్లాపల్లికి.. బాసట

- ఆంజనేయులు హయాంలో బొల్లాపల్లి మండలంలో సర్వతోముఖాభివృద్ధి
- గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మంచి నీటి సౌకర్యం, గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట
- ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధికి చేస్తా : జీవీ

బొల్లాపల్లి, మే 7: అసెంబ్లీ ఎన్నికల్లో వినుకొండ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవీ ఆంజనేయులు 2009 - 2019 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో బొల్లాపల్లి మండలానికి సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేశారు. జిల్లాలోనే గిరిజనులు అధికంగా నివశించే బొల్లాపల్లి మండలంలో తండాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. మండలంలో ప్రతి గిరిజన తండాకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయటంతో పాటు తండాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. అలాగే దళిత వాడల అభివృద్ధికి తోడ్పాటుతో పాటు ఇళ్ళ పట్టాల పంపిణీ చేయటంతో పాటు గృహాలు నిర్మించి మంచినీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించారు. మండలంలో నీటి వసతి లేని గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను నిర్మించి సాగర్ జలాల ద్వారా గ్రామస్తుల దాహార్తిని తీర్చారు. ఆయన ఎమ్మెల్యేగా పది సంవత్సరాల కాలంలో సుమారు రెండు వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఎన్‌టీఆర్ జలసిరి పథకం కింద రూ.3.10 కోట్లతో 157 బోర్లు వేయించటంతో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా 42 పనులకు గాను రూ.6.32 కోట్లు నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం కింద 188 మంది నిరుపేదలకు ప్రతి నెల రూ.2వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వటంతో పాటు హార్టికల్చర్ ద్వారా 2,673 మంది రైతులకు రూ.3.92 కోట్ల సబ్సిడీ మంజూరు చేశారు. మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 175 మంది లబ్ధిదారులకు రూ.2.31 కోట్లు 53 మందికి రూ.70 లక్షలు, బీసీ కార్పొరేషన్ ద్వారా 198 మందికి రూ.5.16 కోట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 255 మందికి రూ.3.19 కోట్లు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 51 మందికి రూ.59.90 లక్షల నిధులు మంజూరు చేశారు. మండలంలో రైతు రుణమాఫీ కింద రూ.9,978 మంది రైతులకు రూ.42.79 కోట్లు రుణమాఫీ చేశారు. ఐదు సంవత్సరాల్లో 2394 మందికి పెన్షన్ మంజూరు చేసి మొత్తం 6,506 మందికి ప్రతి నెల రూ.2,01,54,000 పంపిణీ చేశారు. పసుపు కుంకుమ ద్వారా తొమ్మిది వందల డ్వాక్రా గ్రూపుల్లోని 8,958 మంది సభ్యులకు రూ.12.94 కోట్లు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలో 291 సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.30.68 కోట్లు పనులు చేశారు. ఎన్‌టీఆర్ గృహ నిర్మాణం కింద రూ.27,08 కోట్లతో 1675 గృహాలు మంజూరు చేశారు. తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తానని, వరిక పుడిశెల ప్రాజెక్టు వెంటనే నిర్మాణం చేపట్టి మండలానికి తాగు, సాగు నీరు ఇబ్బందులు లేకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాభివృద్ధి పాటు పడాలని ఆయన కోరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తనను, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీ కృష్ణ దేవరాయలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఉజ్వల రాష్ట్ర భవిష్యత్‌ను పాటు పడాలన్నారు.





ముస్లింల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా...

ముస్లింలంతా టీడీపీతోనే...

● కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 7 : అధికార వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలోని ముస్లింలంతా తెలుగుదేశం పార్టీతోనే ఉన్నారని, ఉంటారని మాజీ మంత్రి చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని 30వ వార్డుకు చెందిన షేక్ కుమీర్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు షేక్ షేర్ ఆలీ, షేక్ సబ్బీర్ ఆలీ, షేక్ హర్షత్‌తో పాటు పలువురు టీడీపీలో చేరారు. చిలకలూరిపేట మండలం కోమటినేనివారిపాలెంకు చెందిన గుంటి నాగేశ్వరరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీతో తెలుగుదేశం పొత్తుపై జగన్ గ్యాంగ్ ఎంత తప్పుడు ప్రచారం చేసినా ముస్లింలు ఎవ్వరూ నమ్మటం లేదని, పైగా ముస్లిం ప్రాంతాల్లో నేతలంతా ఒక తాటిపైకి వచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటామని చెబుతుండటం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ పట్ల వారికున్న విశ్వాసం, అభిమానం చూస్తుంటే మాటలు రావటం లేదన్నారు. అందుకే వారి అభివృద్ధి కోసం కూటమి మేనిఫెస్టోలో ఎన్నో అంశాలు పొందుపరిచామన్నారు. అలానే ముస్లిం రిజర్వేషన్ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పింఛన్‌దారుల కష్టాలు తీరతాయి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 7: ఎన్నికల అనంతరం రాబోయే కూటమి పాలనలో రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల కష్టాలన్నీ తీరుతాయని మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. మంగళవారం చిలకలూరిపేటలో పింఛనదారుల పిలుపు పేరిట రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులతో పాటు పింఛనుదారులందరికీ ప్రతి నెల 1వ తేదీనే జీతాలు, పింఛన్లు అందిస్తామని తెలిపారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిల విషయంలో తగిన చర్యలు గైకొంటామని చెప్పారు. పెన్షనర్ల సంఘం సభ్యులు ప్రత్తిపాటిని కలసి ఆయనకు సంపూర్ణ మద్దతు తెలిపారు. టీడీపీ కూటమి విజయానికి కృషిచేస్తామని తెలిపారు. అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య మాజీ ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరరావు మాట్లాడుతూ ఉద్యోగులను, పెన్షనర్లను ఇబ్బంది పెట్టిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. 17లక్షల కుటుంబాలు ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించలేదన్నారు. ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపు జరగకపోవటంతో సరైన వైద్య సేవలు అందని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులపై 1500లకు పైగా కేసులు పెట్టారన్నారు.

విద్యా దీవెన, ఆసరా, చేయూత ఎగ్గొట్టేందుకు జగన్ కుట్రలు

చిలకలూరిపేట అర్బన్, మే 7: విద్యా దీవెన, ఆసరా, చేయూత సాయం పేరిట ఎప్పుడో బటన్ నొక్కిన జగన్‌రెడ్డి ఇప్పుడు అది ఎగ్గొట్టే డ్రామాలు మొదలుపెట్టారని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అనుమానం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని ఎడవల్లి, కట్టుబడివారిపాలెంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించటంతో పాటు హారతులు పట్టారు. కట్టుబడివారిపాలెంలో ప్రత్తిపాటిని గుర్రంపై ఊరేగించారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల్లో సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. నవరత్నాల పేరిట మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ తొలి ఏడాది నుంచే సంక్షేమ పథకాలకు ఎలా కోతలు వేయాలన్న దానిపైనే దృష్టి పెట్టారన్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా కూటమికి మద్దతు ఇస్తున్నారని, ఐదు కోట్ల చెక్కు ఇచ్చి పవన్ కళ్యాణ్‌ను దీవించి పంపిన ఆయనకు అభినందనలు తెలిపారన్నారు. కాపు సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని కాపు కార్పొరేషన్‌కు రూ.15వేల కోట్ల కేటాయింపును మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. అనంతరం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ మాట్లాడుతూ జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టి మంచి పాలన తెచ్చేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాపుల భవిష్యత్, జీవితాలు బాగు పడాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి, చిలకలూరిపేటలో ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు.


చిలకలూరిపేటలో ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి వెంకట కుమారి, గ్రామాల్లో ప్రచారం చేస్తున్న శరత్

నా కుమారుడినే అక్రమ కేసులతో జైల్లో పెట్టారు

చిలకలూరిపేట అర్బన్, మే 7: తన కుమారుడినే అక్రమ కేసులు పెట్టి 20 రోజులు జైల్లో నిర్బంధించిన నిరంకుశ పాలన జగన్‌రెడ్డిది అని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జగన్ దుర్మార్గపు జమానాలో పేదల బాధలకు అంతే లేదని, మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా నొక్కే బటన్‌లతో మళ్ళీ జగన్‌రెడ్డి గాని, వైసీపీ గాని రాష్ట్రంలో కన్పించకుండా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబ్జా చేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

యడ్లపాడు, మే 7 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల భూములను కబ్జాచేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్‌రెడ్డి తెచ్చారని చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన యడ్లపాడులో మంగళవారం రాత్రి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ రుద్రమదేవి, కూటమి నాయకులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా చర్చిలో ప్రార్థనలో పాల్గొని అనంతరం రోడ్‌షో నిర్వహించారు. ఎస్సీ కాలనీవాసులు కూటమి నాయకులకు బ్రహ్మరథం పట్టారు. గత ఎన్నికల్లో దొంగ నాటకాలాడడమే కాకుండా కల్లబొల్లి మాటలతో ఓట్లు వేయించుకున్న ఇక్కడి మంత్రి విడదల రజిని ప్రజల కనీస మౌలిక అవసరాలను తీర్చకపోగా అందినకాడికి దోచుకుని గుంటూరు పారిపోయి ఇక్కడి సమస్యలను గాలికి వదిలేస్తే ఇక్కడి సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. లావు రుద్రమదేవి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతోపాటు మన బిడ్డల భవిష్యత్ కూడా ముఖ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కులాలు, అన్ని వర్గాల ఉన్నతి కోసం ఏ నాయకుడు పాటుపడతాడో ఆలోచించి ప్రజలు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కె.సాయిబాబు, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


యడ్లపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి, ప్రక్కన రుద్రమదేవి, తోట రాజారమేష్ తదితరులు

18, 20 వార్డులలో వెంకటకుమారి ప్రచారం

చిలకలూరిపేట, మే 7: ఈ ఎన్నికలలో పొరపాటున ఎవరైనా వైసీపీకి ఓటేస్తే మహిళలు తీవ్రంగా నష్టపోయినట్లేనని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి అన్నారు. చిలకలూరిపేటలోని 18,20 వార్డులలో ఆమె మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు.

రెండు గ్రామాలలో శరత్ ప్రచారం

చిలకలూరిపేట, మే 7: ఈ నెల 13న జరగబోతున్న ఎన్నికల్లో ఒక్కొక్క యువకుడు కనీసం 10మందితో కూటమికి అనుకూలంగా ఓటేయించాలని మాజీమంత్రి చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ మంగళవారం రాత్రి పిలుపు ఇచ్చారు. ప్రత్తిపాటికి మద్దతుగా చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, గోవిందపురంలో ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతుగా శరత్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

దగాచేసిన జగన్‌రెడ్డికి ఓట్లతో బుద్ధి చెబుతారు

అఖిల భారత పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పూర్ణచంద్రరావు

నరసరావుపేట టౌన్, మే 7 : ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వకుండా దగా చేసిన జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు పెన్షనర్లంతా సిద్ధం అని అఖిల భారత పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం నరసరావుపేట ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ఒకటో తేదీన పెన్షన్లు లేవు, రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లులేవు, ఇలాంటి ప్రభుత్వాన్ని భరించేందుకు సిద్ధంగా లేమన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థికి బేషరతుగా మద్దతు తెలుపుతున్నామన్నారు. ఐదు సంవత్సరాలుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దగా, దుర్మార్గాలను ఎండగట్టడమే ధ్యేయంగా ముందుకు వెళ్లామన్నారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని గెలిపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, సామాన్య పౌరుల నడ్డి విరిచిన జగన్‌రెడ్డిని ఇంకా భరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లుకు చెల్లించవలసిన పీఆర్సీ, డీఏ, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు విషయంలోను దగా చేస్తున్నారని, దాదాపుగా రూ.30వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. రూ.12.50 లక్షల కోట్ల అప్పులు తెచ్చిన జగన్‌రెడ్డి ఆ సొమ్మంతా ఏం చేశాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబంపై రూ.8 లక్షలకు పైగా అప్పులు పెట్టిన జగన్‌రెడ్డి ఏం ఉద్ధరించినట్లు అని నిలదీశారు. నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు గురవయ్య, వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకుడు విజ్ఞమ్ చౌదరి, నాగరాజు, వెంకటేశ్వర్లు తదదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి అనుచరులతో వచ్చి దాడిచేశారు

● డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మే 7: పోస్టల్ బ్యాలెట్ జరిగే ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులతో వచ్చి దాడిచేశారని టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. మంగళవారం పల్నాడు ఎస్పీని జీ బిందుమాధవ్‌ను కార్యాలయంలో కలిసి ఘటనను వివరించారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ఇవన్నీ పోలీసుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చర్యలు ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ జరగాలని, ప్రతి వ్యక్తి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంటతిరిగే అనుచరులు అనవసరంగా గొడవలలో తలదూర్చవద్దని, ఎమ్మెల్యే బాగానే ఉంటారని, తర్వాత కేసులలో ఇరుక్కునేది అనుచరులేనన్నారు. ఐదేళ్ళుగా వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మీద ఎన్నో కేసులు పెట్టారని, ఎన్నో కుటుంబాల వలన ఎమ్మెల్యే వలన ఇబ్బందిపడుతున్నాయన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా జరగాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, టీడీపీ మైనారిటీ నియోజకవర్గ అధికారప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, బాదుగున్నల శ్రీను, కొల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబ సభ్యులకు సాయం


మృతిచెందిన హోంగార్డు భార్యకు రూ.5 లక్షలు చెక్కును అందజేస్తున్న ఎస్పీ బింధు మాధవ్

నరసరావుపేట లీగల్, మే 7: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో హోంగార్డుగా సేవలందిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ముగ్గురు హోంగార్డు కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున జిల్లా ఎస్పీ బింధు మాధవ్ మంగళవారం ఎస్పీ కార్యాలయంలో చెక్కులను అందజేశారు. నరసరావుపేట ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది జూన్ 4న ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన హోంగార్డు వై మాధవరావు భార్య లక్ష్మీ ప్రసన్నకు, దుర్గి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆగస్టు 31న అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎన్ రంగారావు భార్య గాయత్రికి, వినుకొండ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆగస్టు 19న రోడ్డు ప్రమాదంలో మరణించిన కోదానయ్య కుమారుడు మస్తాన్‌వలికి హోంగార్డులు తమ ఒక రోజు వేతనాన్ని ఒక్కొక్క కుటుంబ సభ్యులకు రూ 5 లక్షల చొప్పున ఎస్పీ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పాల కేసులో జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, మే 7 : కల్తీ పాల కేసులో నేరం రుజువవ్వటంతో నిందితుడు పట్టణంలోని రెడ్డినగర్‌కు చెందిన యర్రంరెడ్డి వెంకటరెడ్డికి మూడు నెలల జైలు శిక్ష, రూ 50వేలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవల్లిక మంగళవారం తీర్పు వెలువరించారు. 2018లో కల్తీ పాలు తయారు చేస్తున్నారని సమాచారం రావటంతో అప్పటి నరసరావుపేట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు నిందితుడి ఇంటి పై దాడి చేసి కల్తీ పాల తయారీకి ఉపయోగిస్తున్న పాల పొడిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ కోర్టులో సాక్ష్యం ప్రవేశ పెట్టి నేరం రుజువు చేయటానికి కృషి చేశారు విచారణలో నేరం రుజువవ్వటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట కల్చరల్, మే 7: పల్నాడు జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపించాలని ఆమె కోరారు.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌ల పోలింగ్ 99.98 శాతం

● నేడు చివరి రోజు

నరసరావుపేట, మే 7: పల్నాడు జిల్లాలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉత్సాహంగా వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో లేని విధంగా 99.98 శాతం పోస్టల్ బ్యాలెట్‌లు పోలయ్యాయి. 16,282 పోస్టల్ బ్యాలెట్‌ను జారీ చేశారు. అయితే నేరుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఫారం 12ను అందజేసిన ఉద్యోగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ జారీచేశారు. దీంతో అంచనాకు మించి పోస్టల్ బ్యాలెట్‌లను ఉద్యోగులు వినియోగించుకున్నారు. 16,278 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. 99.98 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భముగా ఉద్యోగ నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మాచర్ల ఆర్వో, జెసీ శ్యాం ప్రసాద్ కూడా ఇదే కేంద్రంలో ఓటు వేశారు. బుధవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి చివరి రోజని సదరు ఆర్వోలు ప్రకటించారు.


పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఎస్పీ బిందు మాధవ్,జేసీ శ్యాం ప్రసాద్

నియోజకవర్గం	జారీ చేసిన బ్యాలెట్‌లు	వినియోగించేకున్న ఉద్యోగులు	పోలింగ్ శాతం
పెదకూరపాడు	1929	1957	101.45
చిలకలూరిపేట	2207	2153	97.55
నరసరావుపేట	2859	3140	109.45
సత్తెనపల్లి	2303	2232	96.92
వినుకొండ	2373	2399	101.10
గురజాల	2338	2181	93.28
మాచర్ల	2273	2216	97.49
మొత్తం	**16,282**	**16,278**	**99.98**

మూడోరోజు కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నాదెండ్ల, మే 7: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ మూడవ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. మండలంలోని గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి 240 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకున్నారు. అదే విధంగా చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఫారం - 12 పొందిన 68 మంది ఓటు వినియోగించుకున్నారు. కాగా జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోస్టల్ బ్యాలెట్లతో పాటు తదితర విషయాల గురించి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియను ఆర్వో నారదముని ఆయా మండలాలకు చెందిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. కాగా ఎంపీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి బుధ, గురువారాల్లో రీ పోలింగ్ నిర్వహిస్తున్నారు.


పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివ శంకర్

వినుకొండలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

● వినుకొండటౌన్, మే 7: నరసరావుపేట రోడ్డులోని లయోలా ఉన్నత పాఠశాలలో ఉద్యోగులు మూడో రోజు పోలీస్, ఆర్టీసీ, వైద్యసిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గ పరిధిలో 277మంది, ఇతర జిల్లాల నుంచి 66మంది మొత్తం 343 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2373 ఓటర్లు ఉండగా మొదటి రోజు 1355మంది, రెండో రోజు 394 లోకల్ 301 మొత్తం 695 మంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడో రోజు ఉద్యోగులు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల ఖర్చులకూ పంచాయతీ నిధులేనా?

శావల్యాపురం, మే 7: ప్రభుత్వం భరించాల్సిన అన్ని ఖర్చులను గ్రామపంచాయతీలపై భారం మోపడంతో పంచాయతీల అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడుతోంది. ఎన్నికల కోడ్ అమల్లోకొచ్చాక ప్రభుత్వ కార్యాలయాలపై రంగులు, నాయకుల పేర్లు తొలగించేందుకు పంచాయతీలపైనే భారం మోపడంతో చాలా పంచాయతీల్లో నిధులు అడుగంటాయి. ఇప్పుడు కొత్తగా పోలింగ్ కేంద్రాల వద్ద సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, వృద్ధులను పోలింగ్ బూతుల వద్దకు తీసుకెళ్లేందుకు వీల్ చైర్‌లను ఏర్పాటు చేయాలని, దానికయ్యే ఖర్చును పంచాయతీల నుంచి చెల్లించి బిల్లు పెట్టుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పల్నాడు జిల్లాలోని 28 మండలాలలోని 526 గ్రామపంచాయతీల్లో 500 వీల్‌చైర్‌లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ఖర్చులకు పంచాయతీ నిధులు వాడటమేంటని, ఎన్నికలకు కేటాయించిన బడ్జెట్‌ను ఎందుకు వినియోగించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాగైతే గ్రామాల్లో మౌలిక వసతులు కూడా కష్టతరంగా మారునుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, మే 7: దేశ విముక్తికోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నేడు కొనసాగించాల్సిన అవసరం ఉందని పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలోని ఎన్జీవోహోమ్‌లో అల్లూరి సీతారామరాజు 100 సంస్మరణ సభ నిర్వహించారు. దేశ వనరులు కార్పొరేటర్లకు అనే పుస్తకాన్ని విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, అబ్రహం లింకన్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా నాయక్, పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మే 15 నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

నరసరావుపేట కల్చరల్, మే 7: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరానికి 8 నుంచి 14 సంవత్సరాలు గల బాలబాలికలకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు క్రీడా శిక్షకులను సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ ఉద్యోగులపై వేటు

నరసరావుపేట, మే 7: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి రాజకీయ నాయకుల ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు అంగన్‌వాడీ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాదెండ్ల మండలంలోని అంగన్వాడీ ఆయా కొడాకుల రమాదేవి, వినుకొండ మండలంలోని అంగన్వాడీ చౌకూరి చిన్నమ్మాయి, నరసరావుపేట మండలంలోని అంగన్వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మిలను విధులనుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రజాసేవే ధ్యేయం.. ప్రజలే మా బలం

కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ , మే 7: ప్రజాసేవే మా ధ్యేయం, ప్రజలే మా బలం, జీవం ఉన్నంత వరకు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు జీవిస్తామని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నడిగడ్డ నుంచి 15 కుటుంబాలు, నీలగంగవరం నుంచి 5 కుటుంబాలు, ఈపూరు మండలం కొండాయపాలెం నుంచి 20 కుటుంబాలు, బొల్లాపల్లి మండలం మన్నేపల్లి తండా నుంచి 40 కుటుంబాలు జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని తమ కుటుంబ సభ్యుల్లా కలుపుకొని గ్రామాభివృద్ధి కోసం పాటుపడతామన్నారు. రానున్న ఎన్నికల్లో తనతోపాటు శ్రీకృష్ణదేవరాయలును సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాదినేని ఆంజనేయులు, తిరుమలశెట్టి బాలయ్య , గోవిందనాయక్‌లతోపాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పట్టణంలోని 10వ వార్డులో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేస్తున్న శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతి

ఇంటింటికి ఉచిత కుళాయితో నీరందిస్తాం : లీలావతి

వినుకొండటౌన్, మే 7: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాదీవెన పేరుతో చదువుకున్న ప్రతి ఒక్కరికి రూ.15వేలు అందిస్తామని జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ఆమె మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జూలై 1వ తేది నుంచి రూ.4వేలు పెన్షన్ అందుతాయని, ఏప్రిల్ నుంచి మూడు నెలల బకాయితో కలిపి ఇస్తామని అన్నారు. జలసిరి పథకం కింద వినుకొండ పట్టణానికి 159 కోట్ల రూపాయలతో నూతన పైపులైన్, చెరువు పునరుద్ధరణతో ప్రతి ఇంటికి ఉచిత కుళాయిని ఏర్పాటుచేసి నీరు అందిస్తామన్నారు. సేవ చేసేవారిని గుర్తించి ఆలోచించి ఓటు వేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పొట్లూరు(శావల్యాపురం), మే 7: నలభై ఏళ్ల రాజకీయ అనుభవం కలిగి, రాష్ట్రానికి 14ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి చంద్ర బాబునాయుడిని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శావల్యాపురం మండలంలోని పొట్లూరు, కృష్ణాపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులతో కలసి ఆయన మంగళవా ం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ కంచుకోటైన పొట్లూరులో మండుటెండను సైతం లెక్క చేయకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివచ్చి ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు మేళతాళాలతో ఆహ్వానం పలుకగా.. మహిళలు నేతలకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. కొమ్మాలపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అవినీతి, అరాచక పాలనను సాగనంపి నీతి, నిజాయితీలను గెలిపించాలన్నారు. సీఎంగా చంద్రబాబును, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలుని, ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీవీ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టింది చాలక ప్రజల ఆస్తులు కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యాడని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను మోసం చేసేందుకు కంకణం కట్టుకొన్నాడన్నారు. గోదావరి జలాలను సాగర్ కెనాల్‌కు కలపి పల్నాడుప్రాంత రైతులకు రెండు పంటలకు నీరందించాలని చంద్రబాబు రూ.6వేల కోట్లు నిధులు మంజూరు చేస్తే జగన్‌రెడ్డి దాన్ని నిలిపివేసి పల్నాడు ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ వినుకొండకు పది మంది ఎమ్మెల్యేలుగా చేసినా బొల్లాలాంటి దుర్మార్గాలు ఎవ్వరూ చేయలేదన్నారు ఎన్నికలలో సహకరిస్తానని చేబ్రోలు నరేంద్ర దగ్గర రూ.50లక్షలు, జేవీఎస్ దగ్గర రూ.70లక్షలు బొల్లా లంచాలు తీసుకొన్నట్లు తనవద్ద ఆధారాలున్నాయన్నారు. ప్రజలంతా మంచి అభ్యర్థులైన లావు, జీవీలను గెలిపించాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్ చార్జి యార్లగడ్డ లెనిన్, టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు పాల్గొన్నారు.


బొల్లాపల్లి మండలంలో టీడీపీలో చేరిన గ్రామస్థులతో కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు


పొట్లూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొమ్మాలపాటి, జీవీ, మక్కెన, ప్రచారంలో పాల్గొన్న గ్రామస్థులు